# ఖుర్ఆన్ రచయిత ఎవరు ?

﴿ من كتب القرآن ؟ ﴾

[ తెలుగు – Telugu – تلغو ]

MemphisDawah

**అనువాదం :** ముహమ్మద్ కరీముల్లాహ్

**రివ్యూ :** షేఖ్ నజీర్ అహ్మద్

2011 - 1432

IslamHouse.com

# ﴿ من كتب القرآن ؟ ﴾

« باللغة تلغو »

فريق الدعوة بممفس في أمريكا

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نذير أحمد

2011 - 1432

IslamHouse.com

# ఖుర్ఆన్ రచయిత

# ఎవరు?

అనువాదం

ముహమ్మద్ కరీముల్లాహ్

**Memphis Dawah E-Books**

© www.memphisdawah.com

*బిస్మి ల్లాహిర్రహ్మా నిర్రహీం*

*అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

*సకల స్తోత్రములు మహోన్నతుడైన అల్లాహ్ కే చెందును మరియు అల్లాహ్ యొక్క అంతిమ సందేశహరుడైన ముహమ్మద్ సల్లల్లాహుఅలైహి వసల్లం పై, వారి కుటుంబంపై, వారి సహచరులపై మరియు వారిని అనుసరించిన వారందరిపై ప్రళయదినం వరకు అల్లాహ్ యొక్క అపరిమితమైన శాంతి, కరుణ, దీవెనలు కురుయుగాక!*

## తొలి పలుకులు

**"ప్రజలు ఖుర్ఆన్ గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరపు నుండి కాక వేరొకరి తరఫు నుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర వ్యతిరేక విషయాలు ఉండేవి."** [4:82]

కేవలం తననే ఆరాధించటం మరియు తన ఆదేశాల మరియు మార్గదర్శకత్వాలపై ఆధారపడి, నీతివంతమైన జీవితం గడపటమనే మహోన్నత ఉద్దేశ్యంతో సృష్టకర్త మానవుడిని సృష్టించినాడు. స్పష్టమైన మరియు ఆచరణాత్మకమైన సందేశాలతో పంపబడిన ఆయన ప్రవక్తల ద్వారా, మానవ జీవిత పరమార్థం గురించి మరియు ఆయనను ఆరాధించే సరైన విధానం గురించి మానవజాతి తెలుసుకున్నది. మరణానంతర జీవిత విషయాలను గురించి మరియు తమ ఆచరణలకు (కర్మలకు) బదులుగా లభించే ప్రతిఫలాలను, నరకశిక్షలను గురించి ఆయన తన ప్రవక్తల ద్వారా మానవజాతికి తెలిపినాడు.

ఆ ప్రవక్తలు మరియు సందేశహరులు తమపై అవతరింప జేయబడిన సందేశాన్ని ప్రజలకు అందజేసారు. ఉదారహణకు వారిలా చాటి చెప్పినారు: "...... ఓ నా ప్రజలారా! సృష్టికర్తనే (అల్లాహ్ నే) ఆరాధించండి. (అంటే ఆయనకు ఎవ్వరినీ భాగస్వాములుగా చేయకండి). మీ కోసం ఆయన తప్ప వేరే ఏ ఆరాధ్యుడూ లేడు." [దివ్యఖుర్ఆన్: 7:65]

సృష్టికర్త మానవచరిత్ర అంతటా, ప్రతి జాతి వైపునకు ఒక ప్రవక్తను లేదా ఒక సందేశహరుడిని పంపించాడు.

"మరియు నిశ్చయంగా, మేము ప్రతి జాతి వద్దకు ఒక దూతను పంపాము: అల్లాహ్ నే ఆరాధించమని మరియు ఇతర అన్ని రకాల అసత్యపు దేవుళ్ళను తిరస్కరించమని" (బోధించారు) [ఖుర్ఆన్: 16:36]

వారిలో కొందరి గురించి మనకు తెలుపబడింది, మరికొందరి గురించి మనకు తెలుపబడలేదు. అలా మనకు తెలుపబడిన కొందరి పేర్లు: - ఆదము, నోవా (నూహ్), అబ్రహాం (ఇబ్రాహీం), ఇస్మాయీల్, ఇసాక్, జాకోబ్ (యాకూబ్), జోసెఫ్ (యూసుఫ్), మోసెస్ (మూసా), ఆరోన్ (హారూన్), లోత్ (లూత్), డేవిడ్ (దావూద్), సోలోమన్ (సులైమాన్), అలియాస్ (ఇల్యాస్), ఎలీషా, హూద్, దుల్ కిఫిల్, ఈనోఖ్ (ఇద్రీస్), జాబ్ (అయ్యూబ్), షుయైబ్, సాలెహ్, ఇజ్రా, జకరియ్యాహ్, జాన్ (యహ్యా), జీసస్ (ఈసా), ముహమ్మద్ మరియు ఇతరులు - వీరందరిపై అల్లాహ్ యొక్క దీవెనలు కురుయుగాక.
వారిలో కొందరు గ్రంథాలతో అంటే దివ్యవాణితో పంపబడినారు.

మనకు తెలుపబడిన కొన్ని దివ్యసందేశాల పేర్లు - ఇబ్రాహీం యొక్క సూక్తులు, మూసా యొక్క తోరాహ్, దావూద్ యొక్క జబూర్, ఈసా యొక్క ఇంజీల్ (బైబిల్). ఈ దివ్యగ్రంథాలన్నింటిలోనూ సృష్టికర్త నుండి మానవాళికి పంపబడిన ఒకే మూలసందేశం ఉంది.

చరిత్రలోని నిర్ణీత కాలానికి మరియు అక్కడి ప్రత్యేక పరిస్థితులకు వర్తించే విధంగా, తనపై సృష్టికర్త అవతరింపజేసిన ప్రత్యేక ఉత్తర్వులను ప్రతి ప్రవక్తా తన జాతి ప్రజలకు బోధించాడు. అయితే ఆ బోధన, అసలు మూలసందేశంలో మాత్రం మార్పులేమీ లేకుండా, ఒకే విధంగా ఉండేది. తన సందేశాన్ని ప్రజలకు అందజేయటానికి వీలుగా, సృష్టికర్త కొందరికి మహిమలను కూడా ప్రసాదించాడు.

కొన్ని ఉదాహరణలు – మోసెస్ అలైహిస్సలాం యొక్క శత్రుపక్షం ఇంద్రజాలంలో ప్రఖ్యాతి గాంచినది. ఆ ప్రసిద్ధ మంత్రగాళ్ళను ఓడించడమే ఆయనకు ప్రసాదింపబడిన మహిమ. అలాగే జీసస్ అలైహిస్సలాం వ్యతిరేకులు వైద్యశాస్త్రంలో ప్రసిద్ధులు. కాబట్టి దానికి సంబంధించిన మహిమ ఆయనకు ప్రసాదించబడినది, అంటే అల్లాహ్ ఆజ్ఞతో చనిపోయిన వారిని తిరిగి లేపటం, రోగులను నయం చేయటం మొదలైనవి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు వ్యతిరేకులైన అరబ్ ఖురైషీయుల ప్రత్యేకత వారి అద్భుతమైన వక్తృత్వంలో, కవిత్వంలో ఉండినది. కాబట్టి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రసాదించబడిన ప్రధాన మహిమ ఖుర్ఆన్. మాటిమాటికీ ఖుర్ఆన్ స్వయంగా విసిరిన సవాలును మొత్తం అరబ్ దేశంలోని కవులందరూ కలిసి కూడా ఎదుర్కొన లేకపోయారు.

అయితే, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రసాదించ బడిన మహిమ యొక్క సౌందర్యం మరియు శక్తి ఏమిటంటే, అది పూర్వ ప్రవక్తలకు విధించబడిన పరిమితులు లేకుండా, కాలానికి మరియు ప్రాంతానికీ అతీతంగా నిలిచినది. తరతరాలు చూడగలిగే ఒక శాశ్వత మహిమా స్థానం దానికి ప్రసాదించబడింది.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అంతిమ సందేశహరుడు. ఆయన యొక్క ఈ మహోన్నత స్థానం కాలాతీతమైనది మరియు స్థలాతీతమైనది. మరియు అది ప్రళయదినం వరకు జన్మించబోయే మొత్తం మానవజాతి కోసం ఉద్దేశించబడినది.

ఇప్పటి వరకూ చర్చించిన పై విషయాలన్నింటినీ అంగీకరించే వారిలో కొందరు 'ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అంతిమ సందేశహరుడు మరియు ఆయనకు అంతిమ దివ్యగ్రంథం ఖుర్ఆన్ ప్రసాదించబడినదనే' పై మాటలను తిరస్కరించే అవకాశం ఉంది.

ఇక్కడ మా ముఖ్యోద్దేశం – నిశ్చయంగా ఖుర్ఆన్ అనేది అల్లాహ్ స్వయంగా అవతరింపజేసిన దివ్యగ్రంథమనీ మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, అల్లాహ్ యొక్క అంతిమసందేశహరుడనీ ఋజువు చేయటం. ఎందుకంటే అంతిమసందేశం మరియు అంతిమ సందేశహరుడిలలో ఏదో ఒక దానిని స్వీకరించి, మరో దానిని తిరస్కరించ లేము. తప్పని సరిగా రెండింటినీ స్వీకరించాలి లేదా తిరస్కరించాలి.

ఖుర్ఆన్ రచన గురించి వినబడే వివిధ అభిప్రాయాలను మనం ముఖ్యంగా మూడు భాగాలుగా విభజించ వచ్చును:

1. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ఖుర్ఆన్ ను రచించారని వాదించేవారు,
2. ఖుర్ఆన్ ను వేరే ఎవరో రచించి, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు బోధించారని వాదించేవారు.
3. "ఖుర్ఆన్ మానవ రచన కాదు, అది సృష్టికర్త యొక్క స్వచ్ఛమైన పలుకు" అని దృఢంగా విశ్వసించేవారు.

ఈ వ్యాసంలో పైన పేర్కొనబడిన మూడు వాదనలను మనం క్లుప్తంగా తర్కం, చారిత్రక సాక్ష్యం, విషయ విశ్లేషణ మరియు వైజ్ఞానిక సమాచారం మొదలైన వాటి ఆధారంగా పరిశీలిద్దాం.

మా యొక్క పైవాదనల ఆధారంగా ఒకవేళ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారానో లేక ఇతరుల ద్వారానో ఖుర్ఆన్ వ్రాయబడిందని ఋజువైతే, అపుడు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను మరియు ఆయన దివ్యసందేశాన్ని తిరస్కరించటం సబబుగా ఉంటుంది. కానీ ఒకవేళ ఖుర్ఆన్ నిజంగా సృష్టకర్త పంపిన సందేశమని ఋజువైతే, దానిని విశ్వసించటం, అనుసరించటం మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను అల్లాహ్ యొక్క సందేశహరుడిగా స్వీకరించటం మాత్రమే మన ముందు మిగిలే ఏకైక మార్గమనేది గ్రహించవలెను. ఇక మొదటి వాదనపై దృష్టిసారించవలెనని పాఠకులను కోరుతున్నాం ........

# మొదటి వాదన: ఖుర్ఆన్ ను

# ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా రచించారు.

ఖుర్ఆన్ ను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రచించారని వాదిస్తున్న ప్రజలు, ఆయన వేర్వేరు ఉద్దేశాలతో దానిని రచించారని ఆరోపిస్తున్నారు. వాటిని సాధారణంగా ఇలా విభజించవచ్చును.

1) భౌతిక ప్రయోజనాల కోసం లేక అధికారం మరియు కీర్తి ప్రతిష్ఠల కోసం.
2) అరబ్బు ఏకీకరణ కోసం లేక వారిని ధర్మబద్ధంగా సంస్కరించటం కోసం.
3) మూర్ఛవ్యాధికి గురవడం లేక స్వయంగా భ్రాంతీ, భ్రమలకు లోనవడం.

మొత్తం మానవ చరిత్రలో అతి జాగ్రత్తగా జీవిత చరిత్ర నమోదు చేయబడిన ఏకైక మహోన్నత వ్యక్తి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కావటం వలన, మనం తేలికగా పై వాదనలను పరిశోధించి, ఆయన జీవిత చరిత్రతో వాటిని సరిపోల్చవచ్చును.

మొట్టమొదట, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యే స్వయంగా ఖుర్ఆన్ రచించారనే వాదన క్రొత్తదేమీ కాదు. దీనిని ఆయన స్వంత ప్రజలే ఆరోపించారు. ఖుర్ఆన్ లో అల్లాహ్ వారికిలా జవాబిచ్చాడు:

వారితో **ఇలా అను:** " ఇందులో నా అంతట నేను మార్పులూ చేర్పులూ చెయ్యటం నా పని ఎంతమాత్రం కాదు. నేను నా వద్దకు పంపబడే దైవవాణిని (వహీని) మాత్రమే అనుసరిస్తాను. నేను గనుక నా ప్రభువు పట్ల అవిధేయత చూపితే, ఒక పెద్ద భయంకరమైన దినం నాడు పడే శిక్షకు నేను భయపడతాను"**.** ఇంకా **ఇలా అను:** "అల్లాహ్ సంకల్పం ఇదే గనక అయితే నేను ఈ ఖుర్ఆన్ ను మీకు ఎన్నటికీ వినిపించి ఉండే వాణ్ణి కాదు. అల్లాహ్ దానిని గురించి మీకు అసలు తెలిపి ఉండేవాడే కాదు. ఈ గ్రంథం అవతరించక పూర్వం నేను మీ మధ్య ఒక జీవిత కాలాన్నంతా గడిపాను. మీరు బుద్ధిని ఉపయోగించరా**?**" [ఖుర్ఆన్ 10:15-16]

తమ ఎదుట దివ్యఖుర్ఆన్ పఠించటం ప్రారంభించక పూర్వం, తమ మధ్య ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గడిపిన 40 ఏళ్ళ జీవితాన్ని గమనించమని ఈ వచనం విమర్శకులకు సూచిస్తున్నది. ఆ కాలంలో ఆయన ఏనాడూ కవిత్వం వైపు ఆసక్తి చూపలేదని మరియు ఆయన నిరక్షరాసుడనే విషయం వారందరికీ బాగా తెలుసు. మరి, ఆయనకే స్వయంగా చదవటం మరియు వ్రాయటం రానప్పుడు, కవిత్వం కంటే ఎంతో ఉన్నతమైన ఈ వచనాలు ఆయన వద్దకు ఎక్కడి నుండి వచ్చి ఉంటాయి?

అంతేకాక, పై వచనాలలో “ఖుల్ (ఇలా అను)” అని రెండు సార్లు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఆదేశమివ్వబడినది. ఇది ప్రజల ముందు ఒక ప్రత్యేక ప్రకటన చేయటానికి ఉపయోగించే ఆదేశం. ఇలాంటి “ఖుల్” అనే ఆదేశం మొత్తం ఖుర్ఆన్ లో 332 సార్లు వచ్చింది. అయితే ఇతర చోట్ల - **ప్రకటించు** అని, **నీ ప్రభువును స్తుతించు** అని, **స్వయంగా నీవే సాష్టాంగ పడుము** అనీ ఆయన ఆదేశింపబడినారు. మరి, మేము ప్రశ్నిస్తున్నదేమిటంటే - ఎవరైనా స్వయంగా తనను తనే ఎలా సంభోదించుకుంటారు లేదా పుస్తకం వ్రాసుకుంటారు?

అంతే కాక, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ఎంచుకోబడక పూర్వం నుండే తన ప్రజలలో అత్యంత నిజాయితీ పరుడిగా మరియు అత్యంత సత్యవంతుడిగా పేరు సంపాదించారనే వాస్తవాన్ని మనం ఇక్కడ జ్ఞాపకం చేసుకోవలెను. ఆయన తన జీవితంలో ఒక్కసారైనా అబద్ధం చెప్పినట్లు ఎవరి ఉల్లేఖనలలోనూ నమోదు కాలేదు. అనేక మంది పాశ్చాత్య చరిత్రకారులు ఈ సత్యాన్ని ఒప్పుకున్నారు కూడా: ఉదాహరణకు

"ముహమ్మద్ వంటి వ్యక్తి గనుక ఈ భూలోక పాలనాధికారాన్ని తన చేతులలోనికి తీసుకోగలిగితే, అతను ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి, దానికి అవసరమైన శాంతిని మరియు సంతోషాన్ని తీసుకు రాగలడు." **జార్జి బెర్నార్డ్ షా**

"ఈ ప్రపంచంపై అత్యధిక ప్రభావం చూపిన మహోన్నతుల పట్టికలోని మొట్టమొదటి స్థానానికి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క పేరును ఎన్నుకున్న నా నిర్ణయం అనేక మంది పాఠకులకు ఆశ్చర్యం కలిగించవచ్చు, మరికొందరు వేలెత్తి నన్ను ప్రశ్నించవచ్చు, కాని మొత్తం మానవచరిత్రలో కేవలం ఆయన ఒక్కరే ధార్మికంగా మరియు లౌకికంగా (వ్యవహారికంగా) తిరుగులేని సాఫల్యాన్ని సాధించారు." --మైకెల్ **H. హార్ట్, ‘చరిత్రపై ప్రభావం చూపిన వందమంది మహోన్నత వ్యక్తులు’** *THE 100: A RANKING OF THE MOST INFLUENTIAL PERSONS IN HISTORY*, New York: Hart Publishing Company, Inc ., 1978, p. 33

"ముహమ్మద్ దయ, కరుణ, కృప వంటివాటి యొక్క ఆత్మ మరియు ఆయన తోటి ప్రజలు ఆయన సహచర్యాన్ని అనుభవించారు మరియు వారు దానిని ఎప్పటికీ మరవలేరు" –దివాన్ చంద్ శర్మ, తూర్పుదిక్కు ప్రవక్తలు,The Prophets of the East, Calcutta 1935, p. 1 22.

"ఆయనలో సీజర్ చక్రవర్తి మరియు పోప్ ల లక్షణాలు కలిసి ఉన్నాయి. కాని ఆయన పోప్ యొక్క అధికారాలు తన వద్ద లేని పోప్ మరియు చక్రవర్తి యొక్క సైనికదళం తన వద్ద లేని సీజర్ చక్రవర్తి వంటివారు. ఎల్లప్పుడూ తయారుగా ఉండే సైన్యం, రక్షక భటులు, నిలకడైన ఆదాయం, రాజభవనం మొదలైన ఆర్భాటాలు లేనివారు మరియు కేవలం దివ్యసందేశాలపై ఆధారపడి మాత్రమే పరిపాలించేవారని ఒకవేళ ఎవరినైనా సూచించదలిస్తే, అది ముహమ్మద్ తప్ప ఇంకెవ్వరూ కాలేరు. ఎందుకంటే ఆయన పరికరాల, సహాయకుల అవసరం లేని గొప్ప శక్తిసామర్థ్యాలను తనలో కలిగి ఉండేవారు." బోస్వర్త్ స్మిత్, ముహమ్మద్ మరియు

మహమ్మదీయత్వం అనే గ్రంథపు రచయిత **Bosworth Smith**, *Mohammad and Mohammadanism*, London, 1874, p. 92.

"... తత్వవేత్త; వక్త; ప్రవక్త; శాసనకర్త; యోద్ధుడు; భావాల విజేత; తెలివితేటల చక్రవర్తి; హేతుబద్ధమైన విశ్వాసాల స్థాపకుడు; విగ్రహారాధనలను రూపమాపి, ప్రామాణిక ఆరాధనా వ్యవస్థను నెలకొల్పి, తన చిత్రాన్ని మాత్రం మిగల్చనివాడు; ఇరవై కంటే ఎక్కువ సామ్రాజ్యాలకు పునాది వేసినవాడు; అధ్యాత్మిక సామ్రాజ్యాధిపతి – ఆయనే ముహమ్మద్. మానవ ఔన్నత్యాన్ని కొలిచే సకల ప్రమాణాల రీత్యా ఆయన కంటే గొప్పవాడు ఇంకెవడైనా ఉన్నాడా? అని మనం ప్రశ్నించవచ్చు" లమార్ టైన్, ఫ్రెంచి గ్రంథ రచయిత **Lamartine,** *HISTOIRE DE LA TURQUIE*, Paris, 1854, Vol. II, pp. 276 -277

"అరేబియా యొక్క ప్రఖ్యాత ప్రవక్త జీవితాన్ని మరియు గుణగణాలను పరిశీలించిన వారెవరైనా, ఆయన ఎలా బోధించేవారు, ఎలా జీవించేవారు అనే విషయాలు అర్థంచేసుకున్న తర్వాత ఆయనను గౌరవించకుండా ఉండటమనేది అసాధ్యం. ఆయన మహోన్నత శక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రత్యేక సందేశహరులలోనివాడు. ఇంకా మీ ముందుంచిన ఈ గ్రంథంలోని అనేక విషయాలు చాలా మందికి తెలుసు, అయినా నేను వాటిని చదివిన ప్రతిసారీ, ఆ గొప్ప అరేబియన్ బోధకుడిపై అద్భుతంగా మరలా నాలో నూతన భక్తి భావం, గౌరవం కలుగుతాయి." అనిబీసెంటు, ముహమ్మద్ యొక్క జీవితం మరియు బోధనలు. **Annie Besant,** *THE LIFE AND TEACHINGS OF MUHAMMAD*, Madras,1932, p. 4.

"తను నమ్మిన విశ్వాసం కోసం కఠినాతి కఠిన పరిస్థితులను ఎదుర్కొనటానికి తయారుగా ఉండే అతని జీవన విధానం, ఆయనను విశ్వసించిన మరియు తమ మార్గదర్శకుడిగా స్వీకరించిన సహచరుల ఉత్తమమైన నడవడిక, ఆయన సాధించిన సాఫల్యం యొక్క అత్యద్భుత మహిమ - ఇవన్నీ ఆయన యొక్క సైద్ధాంతిక పరిపూర్ణతకు అద్దం పడుతున్నాయి. ఒకవేళ ఎవరైనా ముహమ్మద్ ను నియంతగా భావిస్తున్నట్లయితే, ఆయన సమాజానికి పరిష్కారాలకంటే ఎక్కువగా సమస్యలను ఇచ్చి ఉండేవారని గమనించాలి. అటువంటి అత్యుత్తమమైన ముహమ్మద్ ను పొగడటంలో పాశ్చాత్య దేశాలు చరిత్రలో కనీవినీ ఎరుగనంతటి తక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాయి.." w. మోంటగొమెరీ వాట్, మక్కాలో ముహమ్మద్, **W. Montgomery Watt,** *MOHAMMAD AT MECCA*, **Oxford, 1953, p. 52.**

కాబట్టి, క్రింది విషయాలపై నిజాయితీగా ఒకసారి దృష్టి సారించమని పాఠకులను కోరుతున్నాము:

ఇంతకు ముందు తెలిపినట్లు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం 40 ఏళ్ళ వయస్సు వరకు తన ప్రజలచే 'తమలో అందరి కంటే ఎక్కువ నిజాయితీపరుడిగా' ప్రశంసించబడినారు. అనేకమంది పాశ్చాత్యులచే ఆయన యొక్క నిజాయితీ మరియు పరిపూర్ణత నేటికీ ప్రశంసించ బడుతున్నారు. అయినా సాహిత్యంలో సాటిలేని, చరిత్రలో అరబ్బుదేశాల అత్యుత్తమ కవుల

రచనలు ఎన్నటికీ చేరుకోలేనంతటి అగ్రస్థానానికి చేరుకున్న ఈ గ్రంథాన్ని యాదృచ్ఛికంగా ఆయనే వ్రాసారని ఆరోపించటం ఎంత వరకు సరైనది?

అలాగే, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అసత్యం పలికారని, దాని ఆధారంగానే ఆయన అనేక వేలమంది సహచరులను ఉత్తమ గుణగణాలు, పరిపూర్ణత మరియు నిజాయితీ గలవారిగా మార్చి, ప్రపంచ చరిత్రలోని అత్యుత్తమ మానవ సమాజాన్ని నెలకొల్పారని భావించటం సరైనదేనా?

## 1.1 భౌతిక ప్రయోజనం? కీర్తిప్రతిష్టలు మరియు అధికారం?

కొన్ని భౌతిక ప్రయోజనాల కోసం లేదా కీర్తిప్రతిష్టలు మరియు అధికారం కోసం ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, ఖుర్ఆన్ గ్రంథాన్ని వ్రాసారని కొందరు వాదిస్తున్నారు. కాని, ఈ వాదన అసత్యమని చారిత్రక ఆధారాలు నిరూపిస్తున్నాయి. నిజానికి, ఎవరైనా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితచరిత్ర చదివితే, ప్రవక్తగా ఎంచుకోబడిన తర్వాత రోజులలో కంటే ఆయన ఆర్థిక పరిస్థితి ముందు రోజుల్లోనే బాగుండేదని గుర్తిస్తారు.

25 ఏళ్ళ వయస్సులో, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, మక్కా నగరంలోని ఖదీజా అనే ఒక ధనిక విధవరాలిని వివాహం చేసుకున్నారు. మరియు సుఖసంతోషాలతో, సౌకర్యవంతంగా తన జీవితం గడిపేవారు. అయితే, ఆయన ప్రవక్తగా ఎంచుకోబడి, అల్లాహ్ వైపు పిలుపునివ్వటం ఆరంభించాక, ఆయన ఆర్థిక పరిస్థితి దిగజారటం మొదలైనది. ఒక్కోసారి నిరంతరంగా దాదాపు రెండు నెలల వరకు, పొయ్యి వెలిగించటానికి కూడా ఏమీ ఉండేది కాదు, కేవలం ఖర్జూరపు పండ్లు మరియు మంచినీళ్ళ పైనే జీవించేవారు. దీనికి కారణం - సృష్టికర్త సందేశ ప్రకటన పర్యవసానంగా ఆయనకు మరియు ఆయన కుటుంబానికి ఎదురైన కఠిన పరిస్థితులు.

ఇది తాత్కాలిక త్యాగంగా కాకుండా, ఆయన చివరి శ్వాస వరకు కొనసాగిన గడ్డుపరిస్థితి. ప్రవక్తగా ఎంచుకోబడినా, ఆయన ఏనాడూ విలాసవంతమైన రాజభవనాలలో నివసించలేదు, ఖరీదైన దుస్తులు ధరించలేదు, ఈ ప్రాపంచిక భోగభాగ్యాల జోలికి పోలేదు. ముందు తరం ముస్లింలు సాఫల్యం పొంది, ఆర్థికం ప్రయోజనాలు పొందటం మొదలైన తరువాత, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క భార్యలు ఆయనతో తమ పరిస్థితి గురించి మొరపెట్టుకునేవారు. కనీస అవసరాలు తీరే అవకాశాలున్నా, ఇంకా బీదరికంలోనే ఎందుకు నివసించాలని ఆయనను ప్రశ్నించారు. అప్పుడు సర్వలోక సృష్టికర్త నుండి దివ్యవాణి ఇలా అవతరించినది:

**"ఓ ప్రవక్తా! నీ భార్యలతో ఇలా అను: ఒకవేళ మీరు ఈ ప్రాపంచిక జీవితాన్ని మరియు దానిలోని ఆకర్షణలను కోరుకుంటున్నట్లయితే, రండి! మీరు వాటిని పొందేటట్లు చేస్తాను మరియు మిమ్ములను భార్యల బాధ్యత నుండి మంచి పద్ధతిలో విముక్తి కలిగిస్తాను (విడాకులిస్తాను) కాని, ఒకవేళ మీరు గనుక అల్లాహ్ ను మరియు అల్లాహ్ యొక్క సందేశహరుడిని మరియు**

**పరలోకంలోని ఇంటిని ఇష్టపడుతున్నట్లయితే, నిశ్చయంగా అల్లాహ్ మంచి పనులు చేసేవారి కోసం అనేక పుణ్యాలను తయారుగా ఉంచినాడు".** [ఖుర్ఆన్ 33:28-29]

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటి గదిని, ఆయన సహచరుడైన ఉమర్ బిన్ ఖత్తాబ్ రదియల్లాహు అన్హు ఇలా వర్ణించినారు:
"నేను ఆయన గదిలో శుభ్రపరచబడిన మూడు చర్మపు ముక్కలు మరియు ఒక మూలలో గుప్పెడు బార్లీ గింజలను మాత్రమే చూసాను. ఇంకా ఏమైనా ఉన్నాయా అని నలువైపులా పరిశీలించగా, అవి తప్ప నాకు ఇంకేమీ కనబడలేదు. నేను ఏడవటం మొదలు పెట్టాను. అప్పుడు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం "ఎందుకు ఏడుస్తున్నావు"? అని అడిగారు. జవాబుగా, "ఓ రసూలుల్లాహ్ (అల్లాహ్ యొక్క సందేశహరుడా)! నేను ఎందుకు ఏడవకూడదు? మీ శరీరం పై ముద్రపడిన చాప యొక్క చారలు నాకు కనబడుతున్నాయి మరియు ఈ గదిలో ఉన్న వస్తువులన్నీ నాకు కనబడుతున్నాయి. ఓ రసూలుల్లాహ్ (అల్లాహ్ యొక్క ప్రవక్తా)! మన అవసరాలుకు సరిపోయే వస్తుసామగ్రిని ప్రసాదించమని అల్లాహ్ ను ప్రార్థించండి. వాస్తవమైన దైవవిశ్వాసం లేని, అల్లాహ్ ను ఆరాధించని మరియు తమ రాజులని ఆరాధించే పర్షియన్లు మరియు రోమన్లు, మధ్యలో నుండి నదులు పారే ఉద్యానవనాలలో నివసిస్తున్నారు. కాని అల్లాహ్ యే స్వయంగా తన ధర్మప్రచారం కోసం ఎన్నుకున్న ప్రవక్త మరియు స్వీకరించబడిన అల్లాహ్ యొక్క దాసుడు ఇటువంటి కటిక బీదరికంలో ఎందుకు నివసిస్తున్నాడు?!" అప్పటివరకూ ఏటవాలుగా తన దిండును ఆనుకుని కూర్చుని ఉన్న ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, నా మాటలు వినగానే లేచి నిటారుగా కూర్చుని, నాతో ఇలా అన్నారు, "ఓ ఉమర్! ఈ విషయంలో ఇంకా నీవు సందేహంలోనే ఉన్నావా? పరలోకపు సుఖసంతోషాలు, ఈ లోకపు సుఖసంతోషాల కంటే చాలా ఉత్తమమైనవి. అవిశ్వాసులు తమ వంతు సుఖసంతోషాలను ఈ లోకంలోనే అనుభవిస్తున్నారు. అయితే, విశ్వాసుల ఆ సుఖసంతోషాలు పరలోకం కోసం భద్రపరచబడి ఉన్నాయి". (సహీహ్ ముస్లిం హదీథ్ గ్రంథం)

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బీదవానిగానే చనిపోయారు. ఈ ప్రాపంచిక భోగభాగ్యాల త్యాగం ఆయన స్వయంగా విధించుకున్నదే. ఒకసారి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు మక్కా నగర ముఖ్యనాయకులు వచ్చి, ఇస్లాం ప్రచారాన్ని ఆపించటానికి ఆయనకు ఇలా ఆశ చూపారు.

"ఓ ముహమ్మద్, మీరు, మీ తెగలో ఉత్తములని మీకు తెలుసును. మీ వంశపరంపర మరియు గోత్రం మిమ్మల్ని ఒక పటిష్టమైన ఉన్నత స్థానానికి చేర్చుతున్నది. అయితే ఇప్పుడు మీరు చేస్తున్న ఈ ధర్మసందేశ ప్రచారం మీ ప్రజలలో ప్రధాన చర్చనీయాంశంగా మారినది. మీరు దీని ద్వారా సమాజాన్ని నిలువుగా చీల్చివేసారు. ఇప్పటి వరకు ఆచరిస్తున్న ప్రాచీన ఆరాధనా పద్ధతులను అసత్యమైనవనీ, మూఢనమ్మకాలనీ ప్రకటించారు. దేవీదేవతల ప్రాధాన్యత మరియు ధార్మిక ప్రాముఖ్యతను తగ్గించి మాట్లాడారు. పూర్వీకులను అవిశ్వాసులని పిలిచారు. అయితే,

ఇప్పుడు మేము మీకు వాగ్దానం చేస్తున్న వాటి గురించి ఒకసారి ఆలోచించి, మీకేది స్వీకార యోగ్యమైనదో తెలుపవలెను – మీరే గనుక ఐశ్వర్యాన్ని కోరుకుంటున్నట్లయితే, మేము మా ధనసంపదలను జమచేసి, మిమ్మల్ని మా అందరిలో కంటే గొప్ప ధనవంతుడిగా చేస్తాము. మీరు గనుక కీర్తిప్రతిష్టలను, గౌరవమర్యాదలను కోరుకుంటున్నట్లయితే, మిమ్మల్ని మా నాయకుడిగా స్వీకరిస్తాము మరియు మీ అనుమతి లేకుండా మేము ఏ నిర్ణయం తీసుకోము. మీరు గనుక రాజ్యాధికారాన్ని కోరుకుంటున్నట్లయితే, మేము మిమ్మల్ని మా రాజుగా పట్టాభిషేకం చేస్తాము. మీరు గనుక మీకు పట్టిన ఈ పిశాచాన్ని వదిలించుకోలేక పోతున్నట్లయితే, మేము ప్రసిద్ధ మాంత్రికుడిని వెదికి, మా సంపదనంతటినీ ఖర్చు పెట్టి మీకు వైద్యం చేయిస్తాము." అయితే వీటిలో దేనికీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అంగీకరించక పోవటం వలన, ఆయన ప్రాపంచిక ఐశ్వర్యాన్నీ, భోగభాగ్యాలనూ, అధికారాన్నీ ఏమాత్రం ఇష్టపడలేదనేది ఋజువు అవుతున్నది (ప్రవక్త ముహమ్మద్ జీవితచరిత్ర, **Life of the Prophet Muhammad,** Ibn Hishaam)

వారు తమ ప్రస్తావనలను ముగించగానే ఈ దివ్యవాణి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరించినది:

**"హామీమ్...మ్. ఇది కరుణామయుడూ, కృపాశీలుడూ అయిన అల్లాహ్ సన్నిధి నుండి అవతరింప జేయబడింది. స్పష్టంగా వివరించబడిన వ్యాక్యాలు గల గ్రంథం. అరబ్బీ భాషలో ఉన్న (ఈ) ఖుర్ఆన్, జ్ఞానుల కొరకు, ఇది శుభవార్తలను ఇచ్చేది, భయ పెట్టేదీను. కాని వారిలో చాలా మంది దాని పట్ల విముఖులయ్యారు, కనుక వారు వినరు. వారు ఇలా అంటారు: "నీవు దేనివైపునకు మమ్మల్ని పిలుస్తున్నావో, దానిని గురించి మా హృదయాలపై తెరలు కప్పివేశాయి, చెవులు చెవిటివై పోయాయి. మాకూ నీకూ మధ్య ఒక తెర అడ్డుపడింది. నీవు నీ పని చెయ్యి. మేము మా పని చేస్తాము." (ప్రవక్తా వారితో ఇలా) పలుకు: "నేను కూడా మీలాంటి ఒక మనిషినే. వహీ ద్వారా నాకు ఇలా తెలుపబడుతోంది. మీ ఆరాధ్యుడు కేవలం ఒకే ఒక ఆరాధ్యుడు. కనుక మీరు సేరుగా ఆయన వైపునకే మరలండి. క్షమించు అని ఆయనను వేడుకోండి. జకాహ్ (తప్పని సరి అయిన విధి దానం) ఇవ్వనివారునూ, పరలోకాన్ని తిరస్కరించిన వారునూ అయిన బహుదైవారాధకులు వినాశనం పాలవుతారు. ఇక విశ్వసించి మంచి పనులు చేసినవారు, నిశ్చయంగా వారికి ఎడతెగని ప్రతిఫలం లభిస్తుంది. "** [ఖుర్ఆన్ 41:1-8]

కాబట్టి ఆయన లక్ష్యం గనుక ఐశ్వర్యం, అధికారమే అయి ఉన్నట్లయితే, ఏ మాత్రం కష్టపడకుండా, మరణించే వరకూ బీదరికాన్ని దరిదాపులకు కూడా చేరనివ్వని ఐశ్వర్యాన్ని ఆయన చాలా తేలికగా పొంది ఉండేవారే.

## 1.2 అరబ్బుల ఏకీకరణ కొరకు?

జాతివాదాన్ని మరియు కులతత్వాన్ని వ్యతిరేకిస్తున్న ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లం యొక్క స్వంత ప్రకటనలను మరియు ఆయన జీవన విధానాన్ని గమనించినట్లయితే 'అరబ్ జాతీయులను ఏకం చేయటమే ఆయన లక్ష్యమై ఉండవచ్చుననే' వాదన నిరాధారమైనదని తెలిపోతుంది.

మొదటిగా, ఒకవేళ అదే ఆయన లక్ష్యమై ఉన్నట్లయితే, తన ధర్మప్రచారాన్ని ఆపటానికి బదులుగా ఖురైషీ సర్దారులు ఇవ్వజూపిన అపారమైన ఐశ్వర్యంతోనే ఆయన దానిని సాధించి ఉండేవారు.

రెండవదిగా, జాతివాదం వంటి భావనలు ఇస్లాం ధర్మంలో అస్సలు లేవు. ఇస్లాం ధర్మం ప్రజలను ఏకం చేయటానికి దైవ విశ్వాసపు బంధానికి మరియు సత్యాసత్యాల బంధాలకు ప్రాధాన్యతనిచ్చినదే కాని జాతివాదం, కులతత్వం, జాత్యహంకారం మొదలైన వాటికి కాదు. ఇటువంటి సిద్ధాంతాలను ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా అనేక సార్లు ఖండించి యున్నారు. ఉదాహరణకు:

"అవిశ్వాసులుగా మరణించిన తమ పూర్వీకులను స్తుతించటాన్ని ప్రజలు మానుకోవలెను. ఆ పూర్వీకులు కేవలం నరకాగ్నికి ఇంధనంగా మార బోతున్నారు లేదా వారు తప్పకుండా అల్లాహ్ దృష్టిలో పేడను తన ముక్కుతో దొర్లించే పేడపురుగు లేక కుమ్మెర పురుగు కంటే నీచమైన, హేయమైన, నిరర్థకమైన, వ్యర్థమైనవారుగా మారబోతున్నారు; అజ్ఞాన కాలపు గుడ్డినమ్మకాల దినాలను మరియు (అవిశ్వాసులైన) తమ పూర్వీకుల పొగడ్తలను అల్లాహ్ మీ నుండి తొలగించివేసాడు. నిశ్చయంగా, మానవుడు దైవభీతి గల విశ్వాసి అవుతాడు లేదా దుర్గుణాలతో నిండిన పాపాత్ముడవుతాడు. మానవులందరూ ఆదం సంతతియే మరియు ఆదం మట్టితో సృష్టింపబడెను. [అబూ దావుద్ మరియు అత్తిర్మిథీ హదీథ్ గ్రంథం]

మరో సందర్భంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించినారు: "నిశ్చయంగా అరబ్ జాతీయునికి అరబేతరునిపై లేక అరబేతరునికి అరబ్ జాతీయునిపై, తెల్లవానికి నల్లవానిపై లేక నల్లవానికి తెల్లవానిపై ఎటువంటి ఔన్నత్యమూ లేదు, కాని దైవభీతి విషయంలో తప్ప." [అహ్మద్ హదీథ్ గ్రంథం]

ఇలాంటి అనేక దివ్యసందేశాలతో ఖుర్ఆన్ గ్రంథం నిండి ఉంది. ఉదాహరణ:
**"ఓ మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలు గానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు గలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు."** [సూరహ్ అల్ హుజురాత్ 49:13]

ఖుర్ఆన్ లో మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశాలలో (హదీథ్) ఇటువంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి. కాని ప్రస్తుతానికి విషయాన్ని అర్థం చేసుకునేందుకు పై ఉదాహరణలు పరిశీలిస్తే సరిపోతుంది. రంగుభేదం, దేశం లేక జాతి భేదాలకు అతీతంగా ఇస్లాం సందేశాన్ని విశ్వసించిన వారెవరైనా సరే సోదరబంధంలో ఇమిడిపోగలరు. ఒకవేళ ఖుర్ఆన్ గ్రంథాన్ని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కేవలం అరబ్ జాతీయులను మాత్రమే ఏకం చేసే లక్ష్యంతో రచించి ఉంటే, తన గ్రంథంలో పూర్తిగా దానికి వ్యతిరేకమైన సందేశాన్ని ఎందుకు వ్రాసినట్లు? వాస్తవానికి, ఈ ఇస్లామీయ సందేశం అరబ్ జాతీయులను ముస్లింలుగా మరియు ముస్లిమేతరులుగా విభజించినట్లు పై ప్రకటనల ద్వారా మనకు తెలుస్తున్నది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సహచరులలో అరబ్ జాతీయులే కాకుండా విభిన్న తెగలకు చెందిన అరబేతరులు కూడా ఉండేవారు.

## 1.3 ఆయన మూర్ఛ (అపస్మారక) వ్యాధిగ్రస్థుడా?

కొందరు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను రసూలుల్లాహ్ అంటే దైవసందేశహరుడు కాదని తిరస్కరిస్తున్నవారు. అయినా వారు ఆయన యొక్క నిర్దోషమైన స్వభావాన్నీ, సత్యశీలతనూ నిరూపిస్తున్న చారిత్రక నిదర్శనాల కారణంగా స్వంత ప్రయోజనాల కోసం ఆయన ఖుర్ఆన్ గ్రంథాన్ని రచించలేదని మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ఎంచుకోబడటాన్ని ప్రకటించి ఉండకపోవచ్చని అంగీకరిస్తున్నారు. అందువలన ఆయన మూర్ఛవ్యాధి లేక మతిభ్రమణకు గురయ్యారనే కారణాలను ఇతరుల ముందు ఆరోపిస్తూ, లోలోపల స్వయంగా ఆయనను దైవప్రవక్తగా నమ్మేవారు, ఈ క్రింది వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

మొదటిది, మొత్తం మానవ చరిత్రలోనే అత్యంత జాగ్రత్తగా బయోగ్రఫీ (స్వీయచరిత్ర) నమోదు చేయబడిన మహోన్నత వ్యక్తి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. ఈ వాస్తవం ఆధారంగా వారి జీవితాన్ని పరిశీలిస్తే, ఈ వాదనను నిరూపించే సాక్ష్యాధారాలేవీ మనకు కనబడవు. అయితే ఆయన ఒక సాధారణమైన, బుద్ధిస్థిరతతో కూడిన వివేకవంతమైన జీవితాన్ని తన అంతిమ ఘడియ వరకు గడిపారని వారి జీవిత చరిత్ర నిరూపిస్తున్నది. అంతేగాక, మతిభ్రమణానికి గురయ్యారనే ఈ వాదన అసత్యమైనదని నిరూపించే ప్రామాణిక ప్రకటనలను అనేకం ఉన్నాయి.

రెండవది, ఇస్లాం ధర్మం గురించి విశేష జ్ఞానాన్ని సంపాదించిన కొందరు ముస్లిమేతర ప్రాచీన నాగరికతా శాస్త్రవేత్తలు కూడా మూర్ఛవ్యాధిగ్రస్తుడనే వాదనను అసత్యమైనదిగా మరియు హాస్యాస్పదమైనదిగా త్రోసిపుచ్చారు. మూర్ఛరోగ వాదనపై వ్యాఖ్యానిస్తూ డేనియల్ (Daniel) ఇలా పలికెను: "...ప్రవక్తపై మూర్ఛరోగాన్ని ఆరోపించటమనేది హాస్యాస్పదం చేయాలని ప్రయత్నించేవారు మాత్రమే చేయగలరు, నిజంగా సత్యాన్ని పరిశోధిస్తున్న వారు కాదు." Khalifa, Mohammad *The Sublime Qu'ran and Orientalism* p. 13

జాన్ డేవన్ పోర్టు (John Davenport) ఇలా పలికెను, "ముహమ్మద్ మూర్ఛరోగ దాడులకు గురయ్యారనే ఆరోపణ గ్రీకుల అసత్యపు మరియు అసహ్యకరపు నింద. వాటి ద్వారా గ్రీకులు నూతన ధర్మ ప్రచారకుడి కీర్తి ప్రతిష్టలను కళంక పరచి, క్రైస్తవ ప్రపంచాన్ని ఆయన యొక్క మహోన్నతమైన స్వభావానికి మరియు అత్యున్నతమైన గుణగణాలకు వ్యతిరేకంగా పురిగొల్పినారు." Udhri Taqsir, p.20

ప్రపంచంలో అనేక రకాలైన మూర్ఛ (అపస్మారక) రోగాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి –

- తీవ్రమైన మూర్ఛరోగం (*grand mal),*
- *స్వల్పమైన మూర్ఛరోగం (petit mal) మరియు*
- *మనస్చాలక పేరణం (psychomotor).*

> తీవ్రమైన మూర్ఛరోగం (*Grand Mal*) - *దీనిలో* మామూలుగా వణకటం, హఠాత్తుగా మూర్ఛపోయి పడిపోవటం మరియు కాళ్ళుచేతులు వణకటం వంటివి జరుగును. కొన్నిసార్లు మూర్ఛపోవటానికి ముందు ఆ వ్యక్తి భయంతో, బాధతో అరుస్తాడు. దాని తర్వాత కష్టంగా, ఆగి ఆగి శ్వాస తీసుకోవటం మొదలగును. ఆ తర్వాత శరీరం మెలికలు తిరుగతూ, తన నాలుకను తనే కొరుక్కుంటూ, విపరీతమైన తలనొప్పితో బాధపడును. ఇంకా, వారికి ఆ సమయంలో ఏమి జరిగినదో గుర్తుండదు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తనపై వహీ (దివ్యవాణి) అవతరించటానికి ముందు కొన్నిసార్లు గంట మోగే శబ్దంలాంటి శబ్దం వినబడేదని, మరికొన్నిసార్లు జిబ్రయీల్ అలైహిస్సలాం మానవ ఆకారంలో వచ్చి, తిన్నగా దివ్యసందేశాన్ని తెలిపి వెళ్ళేవారని స్పష్టంగా వివరించారు. దీనిని తీవ్రమైన మూర్ఛరోగ స్థితితో పోల్చితే, ఎలాంటి తీవ్రమైన మూర్ఛరోగానికీ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గురికాలేదని ఎవరైనా సరే సులభంగా గ్రహించవచ్చును.

> *స్వల్పమైన మూర్ఛరోగం (Petit Mal)* – దీనిలో అప్పుడప్పుడు స్పృహ కోల్పోవటం అంటే మూర్ఛపోవటం జరుగును. వీరిలో 70% కంటే ఎక్కువ రోగుల విషయంలో మొదటిసారి మూర్ఛపోవటమనేది 20 సంవత్సరాల కంటే తక్కువ వయస్సులోనే జరిగింది. దీనిలో ఎటువంటి అసందర్భపు కదలికలు ఉండవు. ప్రతిరోజు అనేక సార్లు మూర్ఛపోతారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై వహీ (దివ్యవాణి) అవతరించిన స్థితి దీనికి కూడా వ్యతిరేకంగా ఉంది. మొదటిగా, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై మొదటిసారి వహీ (దివ్యవాణి) అవతరించినప్పుడు, ఆయన వయస్సు 40 ఏళ్ళు. ప్రతిసారి వహీ అవతరణ కొన్ని నిమిషాల వరకు సాగేది. అంతేకాని అది కొన్ని సెకన్లలోనే పూర్తయ్యేది కాదు.

> *మనస్చాలక పేరణం (Psychomotor)* - దీనిలో మూర్ఛపోతారు. బాధాకరమైన అరుపులతో కూడిన ఈ స్థితి కొన్ని సెకన్ల వరకే ఉంటుంది. పదాలు, వాక్యాలు పూర్తి చేయలేక గొణుక్కుంటూ ఉండటం మాత్రమే జరుగుతుంది. అవి అత్యంత ప్రామాణికమైన ఖుర్ఆన్ గ్రంథపు స్పష్టమైన

వచనాల కంటే చాలా తక్కువ మోతాదులో, అస్పష్టంగా, అర్థం చేసుకోలేని విధంగా ఉంటాయి. ఇలాంటి మూర్ఛరోగానికి గురైనవారి ఆలోచనాశక్తి స్తంభించి. అచేతనానికి గురౌతారు. కాని ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై ఖుర్ఆన్ అవతరించేటప్పుడు, ఆయనకు తనపై పూర్తి నియంత్రణ (కంట్రోల్) ఉండేది. ఆ సమయంలో జరిగిన ప్రతి విషయాన్నీ ఆయన స్పష్టంగా గుర్తుకు తెచ్చుకోగలిగేవారు. ఇది మూర్ఛరోగుల అచేతన స్థితికి పూర్తిగా విరుద్ధమైనది.

ఇదిగాక, గతించిన జాతుల గురించి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్పృహలో లేకుండానే ఎలా తెలుసుకోగలిగే వారు? అలాగే ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పృహలో లేకుండానే ఎలా జవాబిచ్చేవారు మరియు ఆ జవాబులు అంత ఖచ్చితంగా ఎలా సరిపోయేవి? ఇవి ఎవరికైనా తప్పక రావలసిన ప్రశ్నలే. ఈ చారిత్రక వృత్తాంతాలు తమకు కూడా తెలుసని దావా చేస్తూ ఏనాడూ, ఎవ్వరూ ముందుకు రాలేదు.

జరగబోయే భవిష్య సంఘటనల గురించి ఆయన ముందుగానే ఎలా తెలుసుకోగలిగేవారు? పర్షియన్లు మరియు రోమన్లు మధ్య జరగబోయే యుద్ధం గురించి మరియు దానిలో విజయం సాధించే పక్షం గురించి అనేక సంవత్సరాలకు ముందే ఆయనెలా తెలుసుకోగలిగారు?

కాబట్టి వాస్తవాలను పరిశీలించిన తరువాత, మూర్ఛరోగ (అపస్మారక వ్యాధి) వాదనలు అర్థం పర్థం లేనివిగా, నిరాధారమైనవిగా తేలిపోవటమే గాకుండా, ఈ ఆరోపణల వెనుక నున్న ద్వేషపూరితమైన వంచన కూడా స్పష్టమవుతున్నది. అసలు సాక్ష్యాధారాలు తమ వాదనలకు విరుద్ధంగా ఉండటమే వారి ఈ వంచనకు కారణం కావచ్చు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు వ్యతిరేకంగా చేయబడిన అపనిందలపై వ్యాఖ్యానిస్తూ, నోర్మన్ డానియల్ (Norman Daniel) ఇలా అన్నారు: "తక్కువ మోతాదులో లేదా ఎక్కువ మోతాదులో వీలయినంత వరకు (పాశ్చాత్య) రచయితలందరూ ఇస్లాం గురించి మరియు దాని ప్రవక్త గురించి విచిత్రమైన, అసంబద్ధమైన కథలు అల్లటానికి శాయశక్తులా ప్రయత్నించినారు.... ఇస్లాంపై దాడి చేయటానికి తప్పుడు సాక్ష్యాధారాలను వాడటమనేది అన్ని చోట్లా, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నది." Norman Daniel, *Islam and the West*, One world Publications 1993, p.267

డానియల్ ఇంకా ఇలా అన్నారు: "అధమంగా - అలాంటి విచిత్రమైన వాటికి ఒక నిశ్చిత ముగింపు ఉంటుంది. అది పక్షపాత రహితంగా పునరావృత్తమవుతుంది. ఉత్తమంగా – వివాదాలకు తెరలేపే అలాంటి విషయాలు మాత్రమే ఎన్నుకోబడతాయి." *ibid*, p.268

ఏదేమైనా, నిస్పక్షపాతంగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క జీవితాన్ని చదివిన ఏ పాఠకుడైనా 'భౌతిక ప్రయోజన; కీర్తి ప్రతిష్ఠలు, అధికారం చేజిక్కించుకోవలనే కోరిక; అరబ్బుల ఏకీకరణ యొక్క కోరిక; ఏనాడైనా అపస్మారక స్థితికి గురికావడం' మొదలైన విషయాలకు ఆయన జీవతంతో ఎలాంటి సంబంధం లేదని వెంటనే తిరస్కరిస్తాడు.

# రెండవ వాదన:

# ఖుర్ఆన్ ను స్వయంగా

# ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రచించలేదు,

# వేరే ఇతరులు రచించారు

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై ఖుర్ఆన్ అవతరించలేదని, నిజానికి ఆయన ఇతర గ్రంథాల నుండి దానిని నకలు చేయటం గానీ లేదా వేరే ఇతరుల నుండి ఆ జ్ఞానాన్ని నేర్చుకోవటం గాని జరిగి ఉంటుందని కొంతమంది దావా చేస్తున్నారు. విడివిడిగా ఈ దావాలను మనం పరీక్షించుదాం.

## 2.1 ఇతర గ్రంథాల నుండి నకలు చేయటం?

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ఖుర్ఆన్ వ్రాయలేదని, ఆయన దానిని ఇతర మార్గాల ద్వారా పొందారని వాదించే వారు 'ఆయన దానిని అపోక్రిఫా[1] నుండి నకలు చేసి ఉంటారని లేదా స్వయంగా బైబిలు నుండే నకలు చేసి ఉంటారని' ఆరోపించినారు.
ఈ ఆరోపణకు ఎదురైన మొదటి వాదన ఏమిటంటే ఇంతకు ముందు తెలిపినట్లుగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక నిరక్షరాసి, మరి చదవటమే రాని ఆయన, నకలు ఎలా చేయగలరు? దయచేసి ఒక విషయాన్ని మీరు జ్ఞాపకముంచుకోవలెను – ఇంతకు ముందు మేము ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గురించి తెలిపినది అందరికీ తెలిసిన ఆయన యొక్క నిష్కళంకమైన స్వభావం మరియు ఆయన నిరక్షరాసి అనే వాస్తవం. మక్కాలోని బహుదైవారాధక అరబ్బులు, ఆయన నిరక్షరాసి కాదని ఆరోపించినట్లు ఎక్కడా నమోదు చేయబడలేదు. ఆయన నిరక్షరాసి అని ఖుర్ఆన్ స్వయంగా తెలిపినది. మరి, ఒకవేళ ఆయన నిరక్షరాసి కానట్లయితే, ఆయనను అవమానించటానికి కాచుకుని కూర్చుని ఉన్న ఆయన శత్రువులు, 'ఆయన నిరక్షరాసి కాదని, ఖుర్ఆన్ లో తెలుపబడిన విషయం అబద్ధమైనదని' ఆయన జీవిత కాలంలోనే తేలిగ్గా ఋజువు చేసి ఉండేవారు. కాబట్టి ఈ వాస్తవం తెలుపుతున్న విషయం ఏమిటంటే 'ఆయన నిరక్షరాసి' అనేది ఆయన జీవిత కాలంలో అందరికీ తెలిసిన ఒక సర్వసామాన్య విషయం మరియు ఎవ్వరూ దీని గురించి ప్రశ్నించలేదు.

రెండో విషయం: వాదనలో భాగంలో ఒకవేళ ఎవరైనా ఆయనకు చదవటం వచ్చి ఉంటుందని భావిస్తున్నట్లయితే, అప్పటికి అసలు అరబీ భాషలోనే అనువదించబడని బైబిలును ఆయన

---

[1]. అపోక్రిఫా – క్రీ.శ. 325వ సంవత్సరంలో జరిగిన కౌన్సిల్ ఆఫ్ నైకియా సమావేశంలో కనాన్ లో చేర్చకూడదని నిర్ణయించబడిన కొన్ని చేతివ్రాత ప్రతులు. కొన్నాళ్ళ తరువాత అవి బైబిలు పేరుతోనూ, మరికొన్నాళ్ళకు కేథలిక్ బైబిలు ప్రతిగానూ ప్రసిద్ధి చెందాయి.

ఎలా చదవి ఉంటారు? బైబిలు పాతనిబంధన యొక్క మొట్టమొదటి అరబీ భాషానువాదం, ఆయన చనిపోయిన రెండు వందల సంవత్సరాల తరువాత గానీ తయారు కాలేదు. అలాగే బైబిలు కొత్త నిబంధన యొక్క మొట్టమొదటి అరబీ భాషానువాదం, ఆయన చనిపోయిన వెయ్యి సంవత్సరాల తరువాత గానీ తయారు కాలేదు. మరి, ఈ చారిత్రక వాస్తవాల్ని ఎవరైనా ఎలా త్రోసిపుచ్చ గలరు?

క్షుణ్ణంగా పరిశోధించిన తరువాత సిడ్నీ గ్రిఫ్ఫిత్ Sidney Griffith ఇలా తీర్మానించాడు: ఇస్లాంకు పూర్వం అరబీ భాషలో క్రైస్తవ బైబిలు యొక్క ఉండవచ్చనే సంభావనీయత గురించి ఎవరైనా చెప్పగలిగేది ఏమిటంటే ఇంత వరకు దాని ఉనికికి సంబంధించి ఎలాంటి ఖచ్చితమైన చిహ్నాలూ బయట పడలేదు. *"అరబీ భాషలో గోస్పెలు: మొదటి అబ్బాసీ శతకంలో అది మొట్టమొదటి సారి ప్రత్యక్షమైంది."*, Oriens Christianus, Volume 69, p. 166

*The Text Of The Old Testament అనే తన పుస్తకంలో ఎర్నెస్ట్* Ernst Würthwein ఇలా పేర్కొన్నాడు: ఇస్లాం విజయం తరువాత అరబీ భాష యొక్క వాడకం విస్తృతంగా వ్యాపించింది. జయించిన ప్రాంతాలలోని యూదులు మరియు క్రైస్తవుల కొరకు అరబీ భాష, వాడుక భాష అయిపోయింది. ఈ పరిస్థితి వలన అరబీ భాషలో బైబిలు యొక్క ఆవశ్యకత పెరిగినది. ముఖ్యంగా వారి అవసరాలు తీర్చటమే లక్ష్యంగా, అనేక స్వతంత్ర అనువాదములు తయారైనాయి. *The Text Of The Old Testament,* 1988, William B Eerdmans Publishing Company, Grand Rapids, Michigan, pp. 104.

కాబట్టి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత కాలంలో, బైబిలు లేదా అపోక్రైపాల ఏ అరబీ అనువాదమూ ఉనికిలో లేదనే విషయం స్పష్టమై పోయింది.

మూడో విషయం, హిజాజ్ (అరేబియా ద్వీపకల్ప లోపలిభాగం) లో, ముఖ్యంగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించిన మరియు పెరిగిన మక్కా నగరంలో క్రైస్తవుల లేదా యూదుల ప్రభావం ఏనాడూ ఉండలేదని చారిత్రక సాక్ష్యాధారాలు తెలుపుతున్నాయి. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించిన సంవత్సరంలో, యుథియోపియా రాజు అబ్రహా మక్కాను జయించటానికి ప్రయత్నించి, విఫలమయ్యాడు. ఇది తప్పించి, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించక ముందు నుండి హిజాజ్ ప్రాంతపు అధిక భాగం ఆనాటి ప్రధాన సామ్రాజ్యాలచే ఆలక్ష్యం చేయబడి, ఏకాకిగా వదిలివేయబడింది.

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క జీవిత కాలం గురించి The *New Catholic Encyclopedia* ఇలా తెలుపుతున్నది: క్రైస్తవ ధర్మప్రచారం హిజాజ్ (అరేబియా ద్వీపకల్పం) ప్రాంతాన్ని తాకలేదు. కాబట్టి అక్కడ క్రైస్తవ చర్చీ సంస్థ ఉనికిని ఆశించలేము మరియు కనుగొనలేము. *New Catholic Encyclopedia*, *Op.Cit*, Vol. 1, pp. 721-722

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవించిన హిజాజ్ ప్రాంతంలో ఆనాడు క్రైస్తవ ప్రభావం అసలే మాత్రం ఉండేది కాదని నిరూపించే చారిత్రక సాక్ష్యాధారాలు కోకొల్లలు. అలాంటప్పుడు బైబిలు మరియు అపోక్రైఫాల నుండి విషయాలను గ్రహించి, కంఠస్థం చేసుకుని, తరువాత ఖుర్ఆన్ వ్రాసి ఉంటారనేది వాస్తవమైతే, (అప్పటికి అరబీలోనే అనువదించబడని) ఆ క్రైస్తవ గ్రంథాలను ఆయనకు ఎవరు బోధించి ఉంటారని తప్పకుండా మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

హిజాజ్ ప్రాంతం ఎంతగా ఏకాకి అయిపోయిందంటే, ఆనాడు మక్కా వాసులలో నుండి ప్రవక్త అబ్రహాం యొక్క అసలు ధర్మం గురించి అన్వేషిస్తున్న నలుగురు వ్యక్తులు, దాని అన్వేషణలో మక్కా నగరాన్ని వదిలి పెట్టవలసి వచ్చినది. వారిలో వరఖా ఇబ్నె నౌఫల్ ఒకరు. అన్వేషణ పూర్తి చేసుకుని ఆయన ఏకదైవారాధకునిగా మరలినారు. రాబోయే పేజీలలో ఆయన గురించి మరింత వివరంగా చర్చించుకుందాము.

నాలుగో విషయం, ఎవరో ఒకరు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఖుర్ఆన్ బోధిస్తున్నారనే వాదనలకు ఖుర్ఆన్ యే స్వయంగా జవాబిస్తున్నది. అదే సమయంలో ఖుర్ఆన్ లో వాడబడిన అరబీ భాష చాలా స్వచ్ఛమైనదనే వాస్తవాన్ని కూడా ఎత్తి చూపుతున్నది.

మరియు: "నిశ్చయంగా ఇతనికి ఒక మనిషి నేర్పుతున్నాడు." అని వారు అనే విషయం మాకు బాగా తెలుసు. వారు సూచించే వ్యక్తి భాష పరాయి భాష. కాని ఈ (ఖుర్ఆన్)భాష స్వచ్ఛమైన అరబ్బీభాష.(ఖుర్ఆన్ 16:103)

మరియు (ఓ ముహమ్మద్!) ఇంతకు పూర్వం నీవు ఏ గ్రంథాన్ని కూడా చదువగలిగేవాడవు కావు మరియు దేనినీ కూడా నీ కుడిచేతితో వ్రాయగలిగేవాడవూ కావు. అలా జరిగివుంటే ఈ అసత్యవాదులు తప్పక అనుమానానికి గురి అయి ఉండేవారు. (ఖుర్ఆన్ 29:48)
ఈ వాదనకు 14 శతాబ్దాలకు పూర్వమే స్వయంగా ఖుర్ఆన్ ద్వారా జవాబివ్వబడింది. అయినా, ఈ విమర్శకులు తమ తప్పుడు వాదనలను బలపరచే ఎలాంటి కొత్త సాక్ష్యాలూ, నేటికీ తీసుకు రాలేకపోయారు.

## 2.2 వేరే మానవుడి నుండి ఖుర్ఆన్ నేర్చుకున్నారు?

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖుర్ఆన్ ను ఇతర మార్గాల ద్వారా పొందారని వాదించే వారిలోని మరికొందరు వేరే వ్యక్తి ఆయనకు ఖుర్ఆన్ బోధించారని ఆరోపిస్తున్నారు. వారిలో కొందరైతే వరఖా ఇబ్నె నౌఫల్ యే ఆయనకు ఖుర్ఆన్ బోధించారని ప్రత్యేకంగా ఆరోపిస్తున్నారు. ఇంతకు ముందు తెలిపినట్లుగా మక్కా నగర బహుదైవారాధనా మరియు విగ్రహారాధనా మూఢవిశ్వాసాల్ని వదిలి, సత్యాన్వేషణలో ప్రవక్త ఇబ్రాహీం యొక్క అసలు ధర్మాన్ని వెతుకుతూ బయలు దేరిన నలుగురిలో వరఖా ఇబ్నె నౌఫల్ ఒకరు. ఆయన ఏకదైవారాధకుడిగా మరలి వచ్చినారు.

ప్రవక్త ఇబ్రాహీం మరియు ప్రవక్త ఈసా అలైహిస్సలాంలతో పాటు ఇతర ప్రవక్తలందరి ధర్మం ఇస్లాం ధర్మమే అనే వాస్తవాన్ని మనం ఇక్కడ తప్పకుండా పేర్కొనవలసి ఉంది. ఇస్లాం అంటే సృష్టికర్త అభీష్టానికి సమర్పించుకోవటం. ముందుగా పరిచయంలో తెలిపినట్లు, ప్రవక్తలందరూ పిలిచినది స్వచ్ఛమైన ఏకదైవారాధన వైపునకే. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ఎంచుకోబడక పూర్వం వరఖా ఇబ్నె నౌఫల్ మరియు సల్మాన్ ఫారసీ మొదలైన వారు ఇతర ప్రవక్తల బోధనలను పోలి ఉన్న ప్రవక్త ఈసా అలైహిస్సలాం యొక్క అసలైన ఇస్లామీయ బోధనలను తమ శక్తి సామర్థ్యాల మేరకు అనుసరిస్తూ, అంతిమ ప్రవక్త రాక కొరకు ఎదురు చూడసాగారు. వారు అన్వేషిస్తుండిన ప్రవక్త ఇబ్రాహీం అలైహిస్సలాం యొక్క ధర్మం అంటే ఇదే.

వరఖా ఇబ్నె నౌఫల్ ఎదురు చూసిన ధర్మం ఇదే. దీనినే ఆయన స్పష్టంగా కనుగొన్నారు. మొట్టమొదటి వహీ (దివ్యవాణి) అవతరణ తరువాత, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తను చూసిన దాని గురించి తెలుసుకోవటానికి ఆయన వద్దకు వచ్చినపుడు, వరఖా ఇబ్నె నౌఫల్ ఆయనతో ఇలా పలికినారు
"ఈ దైవదూత అదే ఎవరైతే రహస్యాలను ఉంచుతుందో మరియు ఎవరినైతే అల్లాహ్ మూసా (అలైహిస్సలాం) వద్దకు పంపేవాడో. నేను మరల యువకుడిగా మారి, నీ ప్రజలు నిన్ను ఈ నగరం నుండి బయటకు వెళ్ళగొట్టే సమయం వరకూ జీవించి ఉండాలని కోరుకుంటున్నాను (నీకు సహాయపడేందుకు గాను)." అపుడు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రశ్నించారు, "వారు నన్ను బయటకు వెళ్ళగొడతారా?" అవునని సమాధానమిచ్చి, వరఖా ఇలా పలికినారు, "నీవు తెచ్చినటు వంటి దానితో వచ్చిన వారెవరైనా సరే, వ్యతిరేక పరిస్థితులను ఎదుర్కొన్నారు; మరియు ఒకవేళ నేను గనుక నిన్ను బహిష్కరించే రోజు వరకు గనుక జీవించి ఉంటే, తప్పకుండా నిన్ను గట్టిగా సమర్థిస్తాను." కానీ, కొన్ని రోజులలలోనే వరఖా చనిపోయారు. [సహీహ్ అల్ బుఖారీ]
జిబ్రయీల్ దైవదూత నుండి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మొట్టమొదటి వహీ (దివ్యవాణి) అందుకున్న కొన్ని రోజులలోనే వరఖా చనిపోయారని మరియు ఆయన ప్రవక్తగా ఎంచుకోబడటాన్ని వరఖా ఇబ్నె నౌఫల్ విశ్వసించారని పైహదీథు ద్వారా స్పష్టమవుతున్నది.

కాబట్టి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు వరఖా ఖుర్ఆన్ నేర్పారనే వాదన నీరుగారిపోయింది.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు సల్మాన్ ఫార్సీ ఖుర్ఆన్ నేర్పారని మరికొందరు ఆరోపించటానికి ప్రయత్నిస్తున్నారు.
సల్మాన్ పర్షియాకు చెందినవ్యక్తి. తమ జొరాష్టియన్ ధర్మాన్ని వదిలి ఆయన క్రైస్తవ ధర్మాన్ని స్వీకరించి, దాని గురించి ఇంకా ఎక్కువగా నేర్చుకోవటానికి స్వంత కుటుంబాన్ని త్యజించి, ధైర్యంగా సిరియా చేరుకున్నారు. అంతిమ ప్రవక్త రాక గురించిన మరియు ఆయన యొక్క చిహ్నాలను గురించిన సమాచారాన్ని అక్కడ ఆయన ఒక క్రైస్తవ బిషప్ నుండి తెలుసుకున్నారు.

ఆ తరువాత ఆయన హిజాజ్ ప్రాంతానికి ప్రయాణం చేస్తుండగా, తోటి ప్రయాణికులు మోసంతో ఆయనను బానిసగా అమ్మివేయబడి, మదీనాకు తీసుకుపోబడినారు. చివరికి అక్కడ ఆయన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను కలిసినారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గురించి తనకు తెలుపబడిన చిహ్నాలన్నీ సరిచూసుకున్న తరువాత ఆయన ఇస్లాం స్వీకరించి, ముస్లింగా మారిపోయినారు.

ఇబ్నె ఇష్హాఖ్ యొక్క సీరతుర్రసూలుల్లాహ్ అనే పుస్తకంలో, సత్యధర్మాన్ని మరియు రాబోయే అంతిమప్రవక్తను అన్వేషిస్తూ, సల్మాన్ చేసిన ప్రయాణం గురించి ఇలా నమోదు చేయబడింది: "`ఆసిమ్ ఇబ్నె ఉమర్ ఇబ్నె ఖతాదా ఉల్లేఖన: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో సల్మాన్ ఫార్సీ ఇలా విన్నవించుకున్నారు, "సిరియాలో రెండు అడవుల మధ్యనున్న ఒక నిర్ణీత ప్రదేశంలో నివశించే ఓ వ్యక్తి వద్దకు వెళ్ళమని అమ్మూరియాలోని నా యజమాని నాతో చెప్పినాడు. ప్రతి సంవత్సరం అతను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి మారుతూ ఉండేవాడు. అలా ప్రయాణిస్తున్నప్పుడు, రోగులు అతని దారిలో నిలబడేవారు. వారి గురించి అతను ప్రార్థించేవాడు. అలా అతను ప్రార్థించిన ప్రతి ఒక్కరు నయమైపోయేవారు. 'నేను అన్వేషిస్తున్న ధర్మం గురించి అతనిని ప్రశ్నించమని, అతను దాని గురించి చెప్పగలడని' నా యజమాని నాతో చెప్పినాడు. అది విని నేను అతనిని వెతుక్కుంటూ, నాకు తెలుప బడిన ప్రాంతానికి చేరుకున్నాను. అక్కడ ప్రజలు అతని కోసం తమ వ్యాధులతో నిరీక్షిస్తూ ఉండటాన్ని చూసాను. చివరికి ఒకరాత్రి అతను ఒక స్థావరం నుండి మరొక స్థావరానికి పోతూ వారి కంటబడినాడు. ప్రజలు తమ వ్యాధితో అతనిని సమీపించినారు. అతను ప్రార్థించిన వారందరూ నయమైపోయినారు. ఆ రద్దీలో ప్రజలు అతనిని సమీపించటానికి నాకు అవకాశమివ్వలేదు. చివరికి అతను తన స్థావరంలో ప్రవేశిస్తుండగా, నేను అతని భుజాన్ని పట్టుకున్నాను. అప్పుడతను 'నువ్వు ఎవరివి?' అని నన్ను అడిగినాడు. అతను నా వైపు తిరగగానే నేను 'అల్లాహ్ నీపై దయ చూపుగాక! హనఫియ్యహ్ ధర్మం గురించి నాకు తెలుపు' అని అడిగాను. దానికతడు 'ఈరోజుల్లో ప్రజలు అడగని విషయం గురించి నీవు ప్రశ్నిస్తున్నావు. హరమ్ (అంటే హిజాజ్) ప్రాంత ప్రజలలో నుండి సత్యధర్మంతో ప్రవక్త పంపబడే సమయం దగ్గరికి వచ్చేసింది. ఆయన వద్దకు వెళ్ళు, ఆయన నిన్ను దాని వద్దకు (హనఫియ్యహ్ ధర్మం వద్దకు) చేర్చుతాడు' అని జవాబిచ్చినాడు. ఆ తరువాత అతను తన స్థావరంలోనికి వెళ్ళిపోయాడు.

కాబట్టి, ఇలా వాదించే ప్రజల ఆరోపణల ప్రకారం ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవేళ మోసగాడు, వంచకుడే అయినట్లయితే (అల్లాహ్ క్షమించుగాక), సల్మాన్ ఆయనను ప్రవక్తగా స్వీకరించి ఉండేవారే కాదు.

రెండో విషయం ఏమిటంటే, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు వలస వచ్చిన తరువాతనే మొదటిసారి సల్మాన్ ఆయనను కలిసినారు. అయితే, దాదాపు రెండు వంతుల కంటే ఎక్కువ ఖుర్ఆన్ (బైబిలులో తెలుపబడిన ప్రవక్తల గాథలతో సహా) అంతకు ముందే మక్కాలో అవతరించ బడింది కదా! మరి దీని గురించి ఏమంటారు?

మూడో విషయం ఏమిటంటే, సల్మాన్ పర్షియాకు చెందినవారు. ఆయన మాతృభాష అరబీ కాదు. ఖుర్ఆన్ యొక్క సాహిత్య శైలి ఎంత ఉన్నతంగా మరియు ఎంతగా భయభక్తులు కలుగజేసేదిగా ఉందంటే, పుట్టినప్పటి నుంచీ అరబీ భాష మాట్లాడిన అరబీ భాషా కోవిదులు కూడా దాని వచనాలను పోలిన వచనాలను రచించటంలో విజయం సాధించలేక పోయారు (మాటిమాటికీ ఖుర్ఆన్ వారిని సవాలు చేసినది, దీని గురించి రాబోయే పేజీలలో చర్చించుదాము). మరి మాతృభాష అరబీ కాని ఒక పర్షియన్ వ్యక్తి దానిని ఎలా రచించగలడు?

పైన పేర్కొన్న వ్యక్తులు గాకుండా వేరే ఇతరులెవరైనా ఖుర్ఆన్ రచించి ఉంటారని ఒకవేళ ఎవరైనా వాదించదలిస్తే, మేము ఖుర్ఆన్ చేసిన ఈ సవాలునే వారి ముందుకు మరల తీసుకువస్తున్నాము ... **వారితో ఇలా అను "దానికి మీ సాక్ష్యమేమిటో తీసుకురండి – మీరు సత్యవంతులే అయితే".** [ఖుర్ఆన్ 2:111]

పైన పేర్కొన్న వారిలో ఎవ్వరూ బోధించలేదని తెలిపోయిన తరువాత, వారు గాకుండా మరింకెవ్వరైనా బోధించి ఉంటారని ఒకవేళ భావిస్తే, మరి వారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఖుర్ఆన్ బోధించినట్లు ఎలాంటి సాక్ష్యాధారాలూ ఎందుకు లేవు? అంతేగాక, అలాంటి వారెవరైనా సరే, ముందుకు వచ్చి తనే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క "టీచర్" నని దావా చేయకుండా వదిలేసేవారా? మచ్చుకైనా అలాంటి సాక్ష్యాధారాలేమీ మనకు కనబడవు.

# మూడవ వాదన: ఖుర్ఆన్ ను
# మానవులెవరూ రచించలేదు
# అది అల్లాహ్ యొక్క స్వచ్ఛమైన పలుకు

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ఖుర్ఆన్ రచించి ఉంటారు లేదా ఇతర మూల గ్రంథాల నుండి గ్రహించి ఉంటారనే వాదనలను క్షుణ్ణంగా పరిశీలించాము మరియు వాటిలోని లోపాలు స్పష్టంగా అర్థం చేసుకున్నాము.

ఒకవేళ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ఖుర్ఆన్ రచించకపోతే లేదా ఇతర వ్యక్తుల నుండి లేక ఇతర మూల గ్రంథాల నుండి గ్రహించక పోతే, మరి అది ఎక్కడి నుండి వచ్చిందనే లాజికల్ ప్రశ్న తప్పకుండా ఉత్పన్నమవు తుంది. దీని జవాబు కొరకు, ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క వాక్కు మరియు అది ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింపజేయ బడిందని, దాని కారణంగా ఆయన అల్లాహ్ యొక్క సందేశహరుడనే వాదనను విధిగా పరిశీలించవలసి ఉంది.

## 3.1 సవాలు

మొదటిగా, ఖుర్ఆన్ అనేక చోట్ల మానవజాతిని ఇలా సవాలు చేస్తున్నది:

**ఇలా అను: "ఒకవేళ మానవులు మరియు జిన్నాతులు అందరూ కలిసి, ఈ ఖుర్ఆన్ వంటి దానిని కల్పించి తీసుకురావటానికి ప్రయత్నించినా, వారు ఒకరికొకరు తోడ్పడినప్పటికీ, దానిని కల్పించి తేలేరు."** [17:88]

మా దాసునిపై (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై) అవతరింప జేసిన దాని గురించి ఒకవేళ మీరు సందేహంలో ఉంటే, అటువంటి ఒక అధ్యాయాన్నైనా తీసుకురండి మరియు అల్లాహ్ తప్ప మీ సహాయకులనందరినీ పిలుచుకోండి, మీరు సత్యవంతులే అయితే (ఇది చేసి చూపండి) [ఖుర్ఆన్ 2:23]

**మరియు అల్లాహ్ తప్ప మరొకరి ద్వారా ఈ ఖుర్ఆన్ కల్పించబడటం సంభవం కాదు; వాస్తవానికి ఇది (పూర్వ గ్రంథాలలో) మిగిలి ఉన్నదానిని (సత్యాన్ని) ధృవపరుస్తోంది. మరియు ఇది (ముఖ్యసూచనలను) వివరించే గ్రంథం; ఇది సమస్తలోకాల పోషకుడైన (అల్లాహ్) తరఫు నుండి వచ్చిందనటంలో ఎలాంటి సందేహం లేదు! అయినా వారు: "అతనే (ముహమ్మదే) దీనిని కల్పించాడు" అని అంటున్నారా? వారితో అను: "మీరు సత్యవంతులే అయితే అల్లాహ్ ను విడిచి మీరు పిలవగలిగే వారినందరినీ (మీ సహాయానికి) పిలుచుకొని, దీని వంటి ఒక సూరహ్ నైనా (రచించి) తీసుకురండి!"** [ఖుర్ఆన్ 10:37-38]

**లేదా వారు , "అతనే (ప్రవక్త యే) దీనిని (ఈ ఖుర్ఆన్ ను) కల్పించాడు" అని అంటున్నారా? వారితో అను: "మీరు సత్యవంతులే అయితే అల్లాహ్ ను తప్ప మీరు పిలుచుకోగల వారినందరినీ పిలుచుకొని, దీని వంటి పది సూరహ్ లను కల్పించి తీసుకురండి!"** [ఖుర్ఆన్ 11:13]

**ఏమీ, వారు : "ఇతనే** (ముహమ్మదే) దీనిని (ఈ సందేశాన్ని) కల్పించు కున్నాడు" **అని అంటున్నారా? అలా కాదు! అసలు వారు విశ్వసించ దలుచు కోలేదు. వారు సత్యవంతులే అయితే దీని వంటి ఒక వచనాన్ని (రచించి) తెమ్మను.** [ఖుర్ఆన్ 52:33-34]

ఏదేమైనా, మాటిమాటికీ ఖుర్ఆన్ ఈ సవాలు చేసినా, దాని అవతరణ సమయాన కవితాత్మక వక్తృత్వ శిఖరాలపై నున్న అరబ్బులు, దానిలోని అతి చిన్న సూరహ్ (అధ్యాయాన్ని) లాంటి సూరహ్ ను కూడా తయారు చేయలేక పోయారు. ఖురైషీయులను సంభోదిస్తూ అల్ ఖామా బిన్ అబ్ద్ అల్ మనాఫ్ పలికి ఈ పలుకులు ఈ వాస్తవాన్ని ధృవీకరిస్తున్నది:

ఓ ఖురైషీయులారా, మీపై ఒక కొత్త ఉపద్రవం వచ్చి పడింది. ముహమ్మద్ మీలో అందరి కంటే ఎక్కువగా ప్రేమించబడిన ఒక నవయువకుడు, ఆయన మాట్లాడటంలో అత్యంత సత్యవంతుడు మరియు అత్యంత నిజాయితీపరుడు – ఆయన కణతలపై నెరిసిన వెంట్రుకలు మీకు కనబడనంత వరకు మరియు ఆయన తన సందేశాన్ని మీకు అందజేయటం మొదలు పెట్టనంత వరకు. అయితే అల్లాహ్ యొక్క సందేశాన్ని అందజేయటం మొదలు పెట్టగానే, మీరు ఆయనపై మాంత్రికుడనీ, ఇంద్రజాలకుడనీ నిందారోపణలు చేయసాగారు. కానీ ఆయన అలాంటి వారు కాదు - ఎందుకంటే అలాంటి వారినీ, వారు గుచ్చేవాటినీ మరియు వారు వేసే ముళ్ళనూ (నల్లజాదు చేసే వ్యక్తుల కొన్ని చిహ్నాలు) మనం చూసి ఉన్నాము; మీరు ఆయనను ఒక సన్యాసి అన్నారు – కానీ మనం ఎందరో సన్యాసులను, వారి ప్రవర్తనను చూసి ఉన్నాము మరియు వారి పద్యాలను విని ఉన్నాము; మీరు ఆయనను ఒక జోతిష్కుడు అన్నారు, కానీ ఆయన జోతిష్కుడు కానే కాదు ఎందుకంటే మనం ఎందరో జోతిష్కుల జోస్యాలను విని ఉన్నాము; మీరు ఆయనను ఒక కవి అన్నారు, కానీ ఆయన కవి కానేకాడు, ఎందుకంటే మనం అన్ని రకాల కవిత్వాలను విని ఉన్నాము; మీరు ఆయనపై భూతపిశాచాలు ఆవహించి ఉన్నాయని అన్నారు, కానీ ఆయనలో ఉక్కిరిబిక్కిరవటం, గొణుక్కోవటం, మతిభ్రంశం చెందటం మొదలైన దుష్టశక్తులు సోకిన వారి చిహ్నాలేవీ కనబడుట లేదు. ఓ ఖురైష్ జాతి పురుషులారా! మీ వ్యవహారాలను, ఆరోపణలను సరిదిద్దుకోండి. అల్లాహ్ సాక్షిగా మీపై చాలా గంభీరమైన ఉపద్రవం వచ్చి పడింది.

ఈ సవాలు నేటికీ అలానే నిలిచి ఉన్నది. దాదాపు 14 శతాబ్దాల ఈ సుదీర్ఘ కాలంలో ఎవ్వరూ ఈ సవాలుకు జవాబివ్వలేక పోయారు. ఈ ముఖ్యాంశం పై కూడా లోతుగా ఆలోచించమని మేము పాఠకుడిని కోరుతున్నాము.

## 3.2 అసమానమైన వక్తృత్వం, వాగ్ధాటి

ఖుర్ఆన్ యొక్క మహాద్భుతమైన వాగ్ధాటి ప్రతి ఒక్కరినీ ఎంతగా ప్రభావితం చేసిందో తెలిపే కథలలో, అల్ వలీద్ ఇబ్నె అల్ ముగీరహ్ కథ అత్యంత ఎక్కువగా ప్రసిద్ధి చెందినది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో అతను మక్కాలో అందరి కంటే ఎక్కువ వాగ్ధాటి గలవాడిగా మరియు గొప్ప కవిగా ప్రసిద్ధి చెందినాడు.

ఒకసారి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సమీపం నుండి వలీద్ ఇబ్నె అల్ ముగీరహ్ పోతుండగా, ఆయన పఠిస్తున్న ఖుర్ఆన్ అతనికి వినపడింది. అది అతనిపై చాలా స్పష్టమైన ప్రభావం చూపింది. అది వింటూ అతను వణికిపోయాడు, ఉలిక్కి పడినాడు, ఆశ్చర్యపోయాడు. మక్కా అంతటా ఈ వార్త వ్యాపించిపోయింది.

ఈ వార్త మక్కా ప్రజలను ప్రభావితం చేసి, వారిని ముస్లింలుగా మార్చి వేస్తుందేమోనని, ఇస్లాం బద్ధవిరోధి అబూ జహల్ భయపడినాడు. పరుగు పరుగున అల్ వలీద్ వద్దకు వెళ్ళి, అతనితో ఇలా అన్నాడు "మామా! (ముహమ్మద్ కు వ్యతిరేకంగా) ఏదైనా చెప్పు. దాని ద్వారా ముహమ్మద్ ను ఇంకా నీవు వ్యతిరేకిస్తూనే ఉన్నావని ప్రజలు తెలుసుకుని, ( ఆయన దివ్యసందేశాన్ని) అసహ్యించుకుంటారు."

దానికి అల్ వలీద్ ఇలా జవాబిచ్చినాడు, "ఇంకా నేనేమని అనాలి? అల్లాహ్ సాక్షిగా, కవిత్వం గురించి నాకు తెలిసినంత ఎక్కువగా తెలిసినవారు మరియు కవిత్వంలో నాతో పోటీ పడగలవారు - మీలోనే కాదు, జిన్నాతులలో కూడా లేరు! అయినా, నేను అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను – ముహమ్మద్ యొక్క పలుకులను నాకు తెలిసిన వాటిలో దేనితోనూ (ఏ కవిత్వ పద్ధతితోనూ) పోల్చలేక పోతున్నాను. మరియు నేను అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను – ఆయన పలుకులు చాలా మధురంగా ఉన్నాయి, సౌందర్యంతో మరియు ఆకర్షణలతో అలంకరించబడి ఉన్నాయి. వాటి మొదటి భాగం ఫలవంతమైనదిగా ఉంది మరియు చివరి భాగం చాలా లోతైన భావాన్ని కలిగి ఉన్నది. అది అన్నింటినీ అధిగమించింది. మిగిన వాటినన్నింటినీ పూర్తిగా జయించి, అజేయంగా నిలిచి పోయింది. దాని కంటే ముందు వచ్చిన వాటినన్నింటినీ (తన వాగ్ధాటితో) అది తునాతునకలు చేసేసింది మరియు నామరూపాలు లేకుండా పూర్తిగా తుడిచి పెట్టేసింది.

దానికి అబూ జహల్ ఇలా స్పందించాడు "ఆయనకు వ్యతిరేకంగా నీవు ఏమైనా పలకనంతవరకూ నీ ప్రజలు తృప్తిపడరు!" అపుడు అల్ వలీద్ "ఖురైషీయులకు తగిన జవాబివ్వడానికి నాకు కొన్ని రోజుల గడువు నివ్వు" అని అబూ జహల్ తో విన్నవించుకున్నాడు.

కొన్ని రోజులు గడిచిన తరువాత, అతని వద్దకు అబూ జహల్ వచ్చి, జవాబుగా ఏమి తయారుచేసావని అడిగినాడు. ఈ వ్యవధిలో అల్ వలీద్ కు "ఇది (ఖుర్ఆన్) ఒక విధమైన

ఇంద్రజాలం, వినేవారిపై అది తన ప్రభావం చూపుతుంది." అనే పలుకులు తప్ప, మరింకేమీ తట్టలేదు. **Biography of Prophet Muhammad**, ఇబ్నె హిషామ్ పే. 225

దీనికి అల్లాహ్ ఖుర్ఆన్ లో ఇలా సమాధానమిచ్చాడు: **అలా కాదు! వాస్తవానికి అతడు మా (అల్లాహ్) సూచన (ఆయత్) ల పట్ల విరోధం కలిగి ఉన్నాడు. నేను త్వరలోనే అతనిని దుర్గమమైన స్థానానికి (శిక్షకు) నెట్టుతాను. వాస్తవానికి అతడు ఆలోచించాడు మరియు మనస్సులో ప్రణాళిక చేసుకున్నాడు. కావున (అతనిని) తాను ప్రణాళిక చేసుకున్నట్లు నాశనానికి గురికానివ్వండి. అవును తాను ప్రణాళిక చేసుకున్నట్లు, నాశనానికి గురికానివ్వండి. అపుడు అతడు ఆలోచించాడు. తరువాత అతను నుదురు చిట్లించుకున్నాడు మరియు కోపంతో చూశాడు. తరువాత అతడు వెనుకకు మరలి దురహంకారం చూపాడు. అపుడు అతడు ఇలా అన్నాడు: "ఇది పూర్వం నుండి వస్తూ ఉన్న ఒక మంత్రజాలం మాత్రమే. ఇది కేవలం ఒక మానవ వాక్కు మాత్రమే. త్వరలోనే నేను అతనిని నరకాగ్నిలో కాల్చుతాను."** [ఖుర్ఆన్ 74:16-26]

ఇది ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో జీవించి ఉన్న మహా కవి యొక్క ధృవీకరణ.

అరబీ భాషను బాగా నేర్చుకుని, దానిపై మంచి పట్టు సాధించిన తూర్పుదేశ భాషల పండితుడు, యూరోపియన్ రచయిత అయిన ఆర్థర్ అర్బెర్రీ ఈజిప్టులో చదువు కొనసాగిస్తుండగా, ఖుర్ఆన్ సౌందర్యాన్ని గుర్తించి, ఇలా అన్నాడు: "...ఖుర్ఆన్ లోని అరబీ భాష యొక్క వాక్పటిమ మరియు ఛందము ఎంత విలక్షణంగా, ఎంత శక్తివంతంగా, ఎంత ఎక్కువ భావప్రధానంగా ఉన్నాయంటే, అంతటి సహజత్వాన్ని కలిగి ఉన్న మరొకటేదైనా సరే, అది అసలు ఒరిజినల్ (ఖుర్ఆన్) యొక్క తళతళ మెరిసే కాంతి మాత్రమే అవుతుంది" ఆర్థర్ అర్బెర్రీ, *The Koran Interpreted* p. 24

ఖుర్ఆన్ యొక్క అసమానమైన వాగ్ధాటిని, వక్తృత్వాన్ని అనేక మంది ముస్లిమేతరులు కూడా ధృవీకరించినారు. ఆక్స్ ఫోర్డు విశ్వవిద్యాలయ ప్రసిద్ధ అరబీభాషా పండితుడు హామిల్టన్ గిబ్బ్ ఇలా అన్నాడు (Hamilton Gibb, the famous University of Oxford Arabist):

...అయినా మక్కావాసులు ఏదైనా అద్భుతం చూపించమని ఆయనను అడిగినారు. దానికి ముహమ్మద్ 'అసాధారణమైన ధైర్యసాహసం మరియు ఆత్మవిశ్వాసంతో తనకు ఇవ్వబడిన అతి ముఖ్యమైన మహిమ స్వయంగా ఖుర్ఆన్ యేనని' జవాబిచ్చినారు. అరబ్బులు తమ భాషపై మరియు వక్తృత్వంపై చాలా మంచి పాండిత్యం సంపాదించి ఉండినారు. ఒకవేళ ఖుర్ఆన్ ముహమ్మద్ యొక్క సొంత రచనైనట్లయితే, 'ఖుర్ఆన్ ను పోలిన పది వచనాలు తయారుచేయండి. ఒకవేళ వారలా చేయలేక పోతే (ముమ్మాటికీ అలా చేయలేరు), వారు ఖుర్ఆన్ ను అత్యద్భుతమైన మహిమగా స్వీకరించాలనే' ఖుర్ఆన్ యొక్క సవాలుకు

స్పందించేవారు. హెచ్ ఎ ఆర్ గిబ్బ్, ఇస్లాం–ఎ హిస్టోరికల్ సర్వే, 1980 ఆక్స్ ఫోర్డ్ యూనివర్సిటీ ప్రెస్. పే 28 H A R Gibb, *Islam - A Historical Survey*, 1980, Oxford University Press, p. 28

ఆల్ఫ్రెడ్ గైల్లాయుమీ ఇలా వ్రాసినారు (Alfred Guillaume): ప్రపంచంలో గంభీరమైన లోపాలతో తప్ప అనువదించబడ నలవికాని ప్రామాణిక మహాకావ్యం ఈ ఖుర్ఆన్. దీనిలో ఒక ప్రత్యేక సౌందర్యం యొక్క ఛందము మరియు చెవులకు ఇంపుగా, మృదువుగా ఉండే స్వరావరోహణం ఉన్నది. అనేకమంది అరబ్బు క్రైస్తవులు దీని శైలిని ఉత్సాహంగా ప్రశంసిస్తుంటారు. దాదాపు అరబీభాషా పండితులందరూ దీని ఔన్నత్యాన్ని గుర్తించారు. ఎపుడైతే ఖుర్ఆన్ చదవబడుతున్నదో లేక పఠించబడుతున్నదో, అది కొన్నిసార్లు తటస్థంగా, సమభావంగా ఉన్న తన శబ్దక్రమం మరియు వాక్య నిర్మాణాల ద్వారా, మరికొన్నిసార్లు అసాధారణమైన విషయ ప్రస్తావనల ద్వారా శ్రోతలపై సమ్మోహక ప్రభావం చూపుతుంది. అది విమర్శకుల నోరు మూయించే మధురమైన మరియు శ్రవణానందకరమైన తియ్యటి సాహిత్యం కలిగి ఉన్నది. దీని ఈ విశేష లక్షణం, దాని అసమానతను సవాలుగా విసిరినది; నిశ్చయంగా అరబ్బుల కవిత్వం మరియు గద్య సాహిత్యంలో దీనితో పోల్చగలిగేది ఏదీ లేదని ధృవీకరించబడింది. Alfred Guillaume, *Islam*, 1990 (Reprinted), Penguin Books, pp. 73-74

'14 శతాబ్దాలుగా అనేక మంది దీని సవాలును ఎదుర్కొనటానికి నిష్ఫలమైన ప్రయత్నాలు చేసారు. అయినా ఈనాటి వరకూ దీని సవాలు అలాగే అజేయంగా నిలబడి ఉంది'. ఇది స్వయంగా ఖుర్ఆన్ యొక్క ఒక మహాద్భుత మహిమ.

## 3.3 ఈ విషయాలను ఒక మానవుడు ఎలా తెలుసుకోగలడు?

మొత్తం మానవజాతి కొరకు ఖుర్ఆన్ ఒక మార్గదర్శక గ్రంథం మరియు ఒక విజ్ఞాన శాస్త్ర గ్రంథం కానప్పటికీ, ఖుర్ఆన్ యొక్క మహాద్భుత మహిమ ఏమిటంటే దానిని ఆధునిక విజ్ఞాన శాస్త్రం కూడా ధృవీకరిస్తున్నది. 14 శతాబ్దాలకు పూర్వం ఏ మానవుడూ తెలుసుకోలేని విషయాలను ప్రస్తావించటమనేది దాని అద్భుత స్వభావానికి ఒక నిదర్శనం! కొంతమంది ఆధునిక శాస్త్రవేత్తలు ఖుర్ఆన్ చదివి, దానిలోని విషయాలను ఆధునిక విజ్ఞాన శాస్త్రంతో పోల్చి, దానిపై వ్యాఖ్యానించారు. ఇక్కడ మేము అలాంటి కొన్ని ఉదారహణలను ఇస్తున్నాము.

**... ఆయన మిమ్మల్ని మీ తల్లుల గర్భాలలో మూడు చీకటి తెరలలో ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇచ్చాడు. ....** [ఖుర్ఆన్ 39:6]

ప్రపంచంలో శరీర నిర్మాణం మరియు పిండోత్పత్తి/పిండ పరిణామ శాస్త్రంలో ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలలో ప్రథమ స్థానంలో ఉన్న డాక్టర్ కీథ్ మూర్, టొరంటో విశ్వవిద్యాలయం ఇలా ప్రకటించినాడు: "గర్భాశయంలో పిండము వివిధ దశలలో వృద్ధి చెందుతుందనే వాస్తవం 1940వ సంవత్సరం కంటే ముందు ప్రతిపాదించబడలేదు. నేడు అనుసరిస్తున్న వివిధ దశలు క్రీ.శ. 15వ శతాబ్దం కంటే ముందు వాడుకలోలేవు."

ఖుర్ఆన్ ఇలా ప్రకటిస్తున్నది: **ఆయన దేనితో అతనిని సృష్టించాడు? అతనిని వీర్యబిందువుతో సృష్టించాడు. తరువాత అతనిని తగిన విధంగా తీర్చిదిద్దాడు.** [ఖుర్ఆన్ 80:18 - 19]

దివ్యఖుర్ఆన్ యొక్క ఈ వచనంపై వ్యాఖ్యానిస్తూ డాక్టర్ కీథ్ మూర్ ఇలా పలికినారు: "జైగోటులోని క్రోమోజోముల యొక్క వంశపరంపర ప్లానును అనుసరించే పిండం అభివృద్ధి చెందుతుందనే ఆలోచన 19వ శతాబ్దం కంటే ముందు కనుగొనబడలేదు. భవిష్య స్వభావం మరియు లక్షణాల ప్లాను లేదా బ్లూ ప్రింటును నుత్ఫా (i.e. వీర్యబిందువు) కలిగి ఉందని ఖుర్ఆన్ లోని వచనం (80:18) స్పష్టంగా సూచిస్తుంది".

**ఆ తరువాత ఆ ఇంద్రియ బిందువును రక్తపు ముద్దగా (జలగగా) మార్చాము. ఆ పైన ఆ రక్తపు ముద్ద (జలగ) ను (నమలబడిన) మాంసపు ముద్ద (జీవాణువుల పిండంగా) మార్చాము. ఆ జీవాణువుల పిండంలో ఎముకలను ఏర్పరచి, ఆ ఎముకలను మాంసంతో కప్పాము. ఆ తరువాత దానిని మరొక (భిన్న) సృష్టిగా చేశాము. కావున శుభకరుడు (శుభప్రదుడు) అయిన అల్లాహ్ యే అత్యుత్తమ సృష్టికర్త.** [ఖుర్ఆన్ 23:14]

పై వచనాల గొప్పదనాన్ని మెచ్చుకునే అసలైన ఉత్తమ పద్ధతి ఏమిటంటే పిండోత్పత్తి యొక్క వివిధ దశల చిత్రాలను నిశితంగా పరిశీలించటం. **"(నమలబడిన) మాంసపు ముద్ద (జీవాణువుల పిండంగా) మార్చాము"** ఆశ్చర్యకరంగా ఈ వచన భాగం, సరిగ్గా పిండం యొక్క మొదటి నెల తరువాతి రూపురేఖలను పోలి ఉండటాన్ని సూచిస్తుంది. ఈ విషయంపై వంద సంవత్సరాల క్రితం, పిండోత్పత్తి శాస్త్రవేత్తలు చెప్పిన దానిని ఒకవేళ ఎవరైనా చదివినట్లయితే, దానిలోని లోపాలను చూసి నవ్వుకుంటారు. ఖుర్ఆన్ లో ఇవ్వబడిన మరికొన్ని వాస్తవాలు – తల్లిపాల ఉత్పత్తి (16:66), గ్రహాలు కక్ష్యలో సంచరించడం (21:33 మరియు 36:40) మరియు జలచక్ర (water cycle) వివరణ (15:22 మరియు 35:9)

ఈ విషయం పై మౌరిస్ బుకైలీ (Maurice Bucaille) ఇలా వ్రాసినారు: "పై పరిశీలన ఖుర్ఆన్ ను ముహమ్మద్ రచించారని దావా చేస్తున్న వారి వాదలను తునాతునకలు చేస్తున్నది. నిరక్ష్యరాసి అయిన ఒక వ్యక్తి, మొత్తం అరబీ సాహిత్యంలోనే సాహిత్యపరంగా అత్యున్నతమైన రచయిత ఎలా కాగలడు? ఆ కాలంలో అభివృద్ధి చెందని, ఏ మానవుడి శక్తి యుక్తులకూ అందని అసాధారణమైన ఆ వైజ్ఞానిక శాస్త్ర ప్రస్తావనలను ఎలాంటి అతి చిన్న లోపమూ లేకుండా ఆయన ఎలా ఉచ్ఛరించ గలిగారు?" - మౌరిస్ బుకైలీ, ది బైబిలు, ది ఖుర్ఆన్ అండ్ సైన్సు, (*The Bible, the Qur'an and Science)*, 1978, p 125.

**ప్రపంచ ప్రసిద్ధ భూగర్భ శాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్ ఆల్ఫ్రెడ్ క్రోనర్ Professor Alfred Kroner**: "వీటిలోని అనేక ప్రశ్నల గురించి మరియు ముహమ్మద్ ఎక్కడి నుండి వచ్చారనేది ఆలోచించిన తరువాత ఆయన కేవలం ఒక అనాగరికుడనే విషయం అర్థమవుతుంది. ఈ విశ్వారంభం వంటి క్లిష్టవిషయాల జ్ఞానం ఆయనకు ఉండటమనేది దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఖుర్ఆన్ లో

తెలుపబడిన ఆ వైజ్ఞానిక విషయాలను శాస్త్రజ్ఞులు చాలా క్లిష్టమైన అత్యాధునిక సాంకేతిక విజ్ఞాన పద్ధతులను ఉపయోగించి, కొన్ని సంవత్సరాల క్రిందటనే కనుగొన గలిగినారు.

ఈ ముఖ్యాంశాలపై కూడా లోతుగా ఆలోచించమని మేము పాఠకుడిని కోరుతున్నాము.

## 3.4 ఆ మహిమ, స్థలం - సమయం హద్దులకు లోబడి లేదు.

ప్రతి ప్రవక్తా తనకు ఒసంగబడిన ధర్మప్రచార బాధ్యతను నెరవేర్చెందుకు గాను కొన్ని ప్రత్యేక మహిమలతో పంపబడినారని మేము పరిచయంలో పేర్కొన్నాము. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడా అనేక మహిమలు చూపినారు. వాటిని కళ్ళారా చూచిన ప్రజల నుండి అవి ప్రామాణికంగా నమోదు చేయబడినాయి. ఉదాహరణకు – పున్నమి చంద్రుడు రెండుగా చీల్చబడటం, కొద్దిమందికే సరిపడే భోజనాన్ని చాలా ఎక్కువ మంది భుజించేటట్లు చేయటం మొదలైనవి. అవి శాశ్వతమైన మహిమలు కాదు మరియు వాటిని ప్రతి కాలంలోనూ, ప్రతి చోటా, ప్రతి తరమూ చూడజాలదు.

అయితే ఖుర్ఆన్ ఒక శాశ్వతమైన మహిమ. దానికి సమయం మరియు ప్రాంతం పరిమితులు లేవు. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలానికి చాలా దూరంగా ఉన్న తరాలకు కూడా అది తమ కోసమే అవతరించబడిందనే భావాన్ని కలుగజేస్తున్నది. ప్రఖ్యాత ముస్లిం పండితుడు ఇబ్నె ఖాలదూన్ దీని గొప్పతనాన్ని వివరిస్తూ ఇలా పలికినాడు: "మహిమలన్నింటిలో అత్యుత్తమమైనది, పరమ పవిత్రమైనది, అత్యంత శుభకరమైనది మరియు అత్యంత స్పష్టమైనది – ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరించబడిన ఖుర్ఆన్. ఎందుకంటే మిగిలిన మహిమలన్నీ సాధారణంగా అసలు దివ్యావతరణ నుండి వేరుగా, ఆ దివ్యావతరణలోని సత్యాన్ని నిరూపించేవిగా ప్రదర్శించబడినాయి. కానీ, ఖుర్ఆన్ మాత్రం – అదే దివ్యావతరణ మరియు అదే మహిమ. అందు వలన అది అత్యంత స్పష్టమైన మరియు శక్తివంతమైన ఋజువు. దీనికి మరో కారణమేమిటంటే అది వాదనలను మరియు నిరూపణలను ఒకే చోట చేర్చివేసింది." **Itr**, p. 113

ఇబ్నె తైమియాహ్ యొక్క క్రింది ప్రకటనను కూడా పరిశీలించమని మేము పాఠకులను కోరుతున్నాం: "(మహిమలన్నింటిలోనికి) అత్యుత్తమమైనది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించబడిన ఖుర్ఆన్. ఎందుకంటే అదే అల్లాహ్ యొక్క ధర్మం, ఆయన పలుకు మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ఎంచుకోబడాన్ని నిరూపిస్తున్నది. ఆ దివ్యావతరణ అత్యంత అసహజమైనది, అతీతమైనది, మహాద్భుతమైనది మరియు అపూర్వమైన కార్యాలు కలిగి ఉన్నది. ఎందుకంటే అది ఒక పిలుపు (కేవలం ఒకే ఆరాధ్యుడిని ఆరాధించటం వైపునకు పిలుస్తున్న) మరియు ఒక నిదర్శనం (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ఎంచుకోబడినారని తెలిపే) మరియు ఒక మహాద్భుతం (i.e., ఇవన్నీ ఒక దానిలోనే ఇమిడి ఉండటం)" **Collection of Islamic Rulings**, vol. 11 p. 324

## 3.5 జీవితాలను మార్చివేసేంతటి తీవ్రప్రభావం చూపుతున్నది

ఖుర్ఆన్ ఇలా ప్రకటిస్తున్నది: **"నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ పూర్తిగా సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది ..."** [ఖుర్ఆన్ 17:9]

ఖుర్ఆన్ మొత్తం మానవజాతి కొరకు అవతరించిన గ్రంథం. అది వ్యక్తులకు మాత్రమే పరిమితం గాకుండా, మొత్తం సమాజాన్నంతటినీ సరిదిద్దటానికి ఉద్దేశించబడింది. అది దారి తప్పిన వ్యక్తులలో మంచి మార్పు తీసుకువస్తుంది. ఒకవేళ సరైన దారిలో ఉంటే, వారిని ఇంకా ఎక్కువగా అభివృద్ధి పరుస్తుంది.

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ఎంచుకోబడక ముందు, అరబ్బులు చాలా అధికంగా మద్యం త్రాగేవారు, తెగల ప్రజలు పరస్పరం యుద్ధాలలో మునిగి ఉండేవారు. అక్కడితో ఆగక తమకు పుట్టిన ఆడపిల్లలను సజీవంగా పాతిపెట్టేసేవారు. కానీ, ఎవరైనా ఖుర్ఆన్ చరిత్ర చదివితే, కేవలం 20 సంవత్సరాల వ్యవధిలో, అరేబియా ద్వీపకల్పంలోని దాదాపు మొత్తం అరబ్బులను మరియు అరబ్బేతరులను ఖుర్ఆన్ తన అత్యత్భుతమైన మహిమ ద్వారా మార్చివేయటాన్ని కనుగొంటారు. అది విశ్వాసం మరియు ప్రేమ బంధాలతో కూడిన సోదరబంధుత్వాన్ని వారి మధ్య నెలకొల్పింది. అది ఆ బంధాన్ని ఎంత బలంగా నాటిందంటే, ఏ ఒక్కరికి బాధ కలిగినా, సమాజం మొత్తం వెంటనే స్పందించేది. త్వరలోనే ఈ ప్రజలు ప్రపంచాన్ని శాసించే నాయకులయ్యారు. శతాబ్దాలు తరబడి తన ప్రభావాన్ని చూపే అతి గొప్ప నాగరికతకు పునాదిరాళ్ళయ్యారు. ఈ ప్రభావం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చనిపోయిన తరువాత కూడా చాలా కాలం పాటు కొనసాగింది. ఈ క్రింది పేరాలో మనం దీనిని చూస్తాము:

ముస్లిం సైనికుల యొక్క స్వచ్ఛమైన స్వభావం మరియు లక్షణాన్ని ఒక రోమన్ సైన్యాధికారి ఇలా ప్రశంసించాడు: "రాత్రివేళల్లో వారు ప్రార్థనలలో మునిగి ఉండటాన్ని నీవు చూస్తావు. పగటి పూట వారు ఉపవాసంలో ఉండటాన్ని నీవు చూస్తావు. వారు తమ వాగ్దానాలను పూర్తి చేస్తారు, మంచి పనులు చేయమని ఆజ్ఞాపిస్తారు, చెడును రూపుమాపుతారు మరియు తమ మధ్య హెచ్చుతగ్గులకు తావివ్వకుండా, సమానత్వాన్ని పూర్తిగా పాటిస్తారు."

రెండో అతను వారి గురించి ఇలా సాక్ష్యమిచ్చాడు: "వారు పగటిపూట గుర్రపు రౌతులు మరియు రాత్రిపూట ఆరాధనలలో మునిగేవారు. ఆ యా ప్రాంతాలు తమ వశంలో ఉన్నా సరే, అక్కడ తాము భుజించే ఆహారానికి బదులుగా ధనం చెల్లించేవారు. ఏదైనా ప్రదేశానికి చేరుకున్నప్పుడు, ముందుగా అభివాదం చేసేది వారే. వారు తమ శత్రువులను నామరూపాలు లేకుండా తుడిచిపెట్టే పరాక్రమశాలురైన, శూరులైన యుద్ధవీరులు."

మరియు మూడో అతను వారి గురించి ఇలా సాక్ష్యమిచ్చాడు: "రాత్రివేళల్లో వారు ఈ ప్రపంచానికి సంబంధించిన వారు కాదేమో అని భావించేలా కనబడతారు. నమాజులో తప్ప, వారు మరే

పనిలోనూ కనబడరు. పగటి పూట వారిని తమ గుర్రాలపై చూసినపుడు, వారు తమ జీవితాంతం (యుద్ధం చేయటం తప్ప) మరింకేమీ చేయని వారిలా కనబడతారు. విలువిద్యలో వారిని మించిన వారు లేరు మరియు వారు గొప్ప ఈటెకాండ్లు. అయినా వారు ఎంతో భయభక్తులు గల ధార్మికులు. దైవాన్ని చాలా ఎక్కువగా, తరచుగా ధ్యానిస్తారు. వారితో ఉన్న వారెవరైనా వారి నుండి దైవధ్యానాన్ని తప్ప, మరో విషయాన్ని చాలా అరుదుగా వింటారు". ఇబ్నె కథీర్, బిదాయ్యహ్ వ నిహాయ్యహ్ పేజీ. 53

## 3.6 పరస్పర వ్యతిరేక వచనాలు లేకుండా ఉండటం

ఖుర్ఆన్, మానవజాతిని ఇలా సవాలు చేస్తున్నది: " ఏం, వారు ఖుర్ఆన్ పట్ల లోతుగా ఆలోచించరా? ఒకవేళ అది అల్లాహ్ నుంచి గాక వేరెవరి నుంచైనా అయి ఉన్నట్లయితే, తప్పకుండా వారందులో ఎంతో వైరుధ్యాన్ని కనుగొని ఉండేవారు" [ఖుర్ఆన్ 4:82]

23 సంవత్సరాల దీర్ఘకాలంలో, వివిధ పరిస్థితులలో, వివిధ సమస్యలను సంబోధిస్తూ అవతరించ బడినా, ఖుర్ఆన్ లో ఎలాంటి పరస్పర వ్యతిరేక వచనాలు లేకపోవడమనేది, చిత్తశుద్ధితో తటస్థంగా ఆలోచించే పాఠకుల కొరకు దాని మూలాలను స్పష్టంగా సూచిస్తుంది.

# న్యాయబద్ధమైన ముగింపు

ఖుర్ఆన్, స్వయంగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంచే రచింపబడలేదని, ఆయన దానిని ఇతరుల నుండి గ్రహించలేదని మరియు ఇతర మూల గ్రంథాల నుండి సేకరించబడలేదనే వాస్తవాలను మనం గుర్తించాము. ఓ పాఠకుడా, ఇంకా దీని గురించి సందేహిస్తున్నావా?

ఒకవేళ నీవింకా సందేహిస్తున్నట్లయితే, ఖుర్ఆన్ స్వయంగా చేస్తున్న సవాలును స్వీకరించి, దానిని అసత్యమైనదిగా నిరూపించమని మేము నిన్ను అడుగుతున్నాము.

మాటిమాటికీ ఖుర్ఆన్ సవాలు చేసినప్పటికీ, ఈ 14 శతాబ్దాల కాలంలో, సూక్ష్మబుద్ధి గల కవులలో ఏ ఒక్కరూ ఖుర్ఆన్ యొక్క సాహిత్య సౌందర్యాన్ని మరియు వక్తృత్వాన్ని పోలిన ఒక చిన్న భాగాన్నైనా తయారు చేయలేక పోయారు మరియు అలా ఎన్నటికీ తయారు చేయలేరనే వాస్తవం పై లోతుగా ఆలోచించండి.

వారు ఎందుకు సాఫల్యం పొందలేకపోయారు? ఎందుకంటే, నిశ్చయంగా ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క వాక్కు మరియు అల్లాహ్ తో ఎవరు పోటీ పడగలరు? వారు అలా ఎన్నటికీ తయారుచేయలేరని ఖుర్ఆన్ లో అల్లాహ్ ప్రకటించియున్నాడు. **ఇలా అను: "ఒకవేళ మానవులు మరియు జిన్నాతులు అందరూ కలిసి, ఈ ఖుర్ఆన్ వంటి దానిని కల్పించి తీసుకురావటానికి ప్రయత్నించినా, వారు ఒకరికొకరు తోడ్పడినప్పటికీ, ఇటువంటి దానిని కల్పించి తేలేరు."** [ఖుర్ఆన్ 17:88]

మరో మాటలో, అనంత కాలం వరకు అసమానమైనదిగా మరియు సాటిలేనిదిగా నిలిచిపోనున్నదని, ఖుర్ఆన్ స్వయంగా తనే సూచించింది. ఖుర్ఆన్ యొక్క సాహిత్య సౌందర్యానికి మరియు వక్తృత్వానికి పోటీగా మరొక దానిని తయారు చేయటానికి ప్రయత్నించడం వ్యర్థమని ముందుగానే తెలుపబడింది: "మా దాసునిపై (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై) అవతరింపజేసిన దాని గురించి ఒకవేళ మీరు సందేహంలో ఉంటే, అటువంటి ఒక అధ్యాయాన్నైనా తీసుకురండి మరియు అల్లాహ్ తప్ప మీ సహాయకులను అందరినీ పిలుచుకోండి, మీరు సత్యవంతులే అయితే (ఇది చేసి చూపండి). కాని, మీరు గనుక అలా చేయలేకపోతే - నిశ్చయంగా మీరు అలా ఎన్నటికీ చెయ్యలేరు – మానవులు మరియు రాళ్ళు ఇంధనంగా చేయబడే నరకాగ్నికి భయపడండి. అది సత్యతిరస్కారుల కొరకు తయారు చేయబడినది." [ఖుర్ఆన్ 2:23-24]

ఏదైతే పైన తెలుపబడిందో, ఖచ్చితంగా అదే జరిగింది! ఈనాటి వరకూ ఎవరూ ఈ సవాలును ఎదుర్కొనలేకపోయారు మరియు ఎన్నటికీ ఎదుర్కోలేరు కూడా. ఈ మొత్తం వ్యాసంలో మేము పాఠకుడిని లోతుగా, చిత్తశుద్ధితో ఆలోచించమని కోరాము. ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క

పలుకు అనే ముగింపుకు గనుక ఒకవేళ చేరితే, మరో అడుగు ముందుకు వేసి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం 'అల్లాహ్ యొక్క సందేశహరుడు' అనే విషయాన్ని మనం తప్పకుండా స్వీకరించవలసి ఉంటుందని మేము ప్రారంభంలోనే పేర్కొని ఉన్నాము.

వివేకవంతమైన నిర్ణయాన్ని చిత్తశుద్ధిగల పాఠకుడి మీదే వదిలిపెడు తున్నాము. తమ ధర్మంపై కలిగి ఉండే భావావేశ పూరితమైన నిబద్ధతను వారి వివేకవంతమైన నిబద్ధత అధిగమించాలి. 'కారణం' అనేది వాస్తవానికి మనం సత్యాన్ని కనుగొనేందుకు వాడుతున్న ప్రాథమిక సాధనం. అది హేతుబద్ధమైనదా, వివేకవంతమైనదా, విచక్షణ గలదా; విశ్వవ్యాప్తమైనదా, సర్వసామాన్యమైనదా; అన్ని కాలాలకు, అన్ని ప్రాంతాలకు వర్తించగలదా; వేర్వేరు రంగుల మరియు వేర్వేరు భాషల ప్రజలతో అనుసరించబడగలదా; దాని ధర్మగ్రంథం ఎలాంటి మార్పులు, చేర్పులకు గురికాకుండా స్వచ్ఛంగా, అవతరించబడిన అసలు రూపంలోనే ఇంకా మిగిలి ఉన్నాదా; అంతర్గతంగా లేదా బహిరంగంగా వైరుధ్యాలేవీ లేకుండా ఉన్నదా ... మొదలైన విషయాలను పరిశీలించటం ద్వారా ఏ ధర్మాన్నైనా లేదా ఏ సిద్ధాంతాన్నైనా మనం క్షుణ్ణంగా పరీక్షించవచ్చును.

ఒకవేళ తన వచనాలలోనే విభేదాలు మరియు వైరుధ్యాలు కలిగి ఉంటే, ఆ దివ్యగ్రంథం అంతర్గతంగా అనిశ్చితమైనది. అలాగే, ఒకవేళ వైజ్ఞానిక మరియు ప్రాకృతిక వాస్తవాలతో విభేదిస్తున్నట్లయితే, అది బహిర్గతంగా అనిశ్చితమైనది. సృష్టికర్తకు తన సృష్టి గురించి, తను సృష్టించబోయే దాని గురించి తెలియక పోవటమనేది అసాధ్యమైన విషయం.

కొన్ని క్షణాల దీర్ఘాలోచన సామాన్యంగా మనల్ని సృష్టికర్త యొక్క ఏకైకత మరియు అద్వితీయతలోని సత్యాన్ని అంగీకరించేలా చేస్తుందని మా అనుభవం తెలుపుతున్నది. ఇక మిగిలినది ఏమిటంటే, ఏ ధర్మం నిజంగా ఏకదైవారాధనను స్వాభావికంగా కలిగి ఉందనే విషయం. అసత్యాల నుండి సత్యాన్ని వేరు పరచే ఒక ప్రధానమైన గీటురాయి ఆ ధర్మ దివ్యగ్రంథపు ప్రామాణికత అని మేము దృఢంగా నమ్ముతున్నాము. ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క వాక్కు అనే పైనిర్వివాదమైన ఋజువును మేము మీ ముందు ఉంచాము. వాస్తవం ఏమేమిటంటే, సృష్టికర్త నుండి ప్రామాణికమైన, ఎలాంటి కల్తీలు లేని స్వచ్ఛమైన దివ్యగ్రంథాన్ని, అవతరించబడినప్పటి నుండి ఏ ఒక్క అక్షరం కూడా మార్చబడకుండా, నేటికీ దాని అసలు రూపంలో కలిగి ఉన్నామని కేవలం ముస్లింలు మాత్రమే దావా చేస్తున్నారు. తమ దివ్యగ్రంథాలను నిజానికి మానవులే రచించినట్లుగా అనేక ఇతర ధర్మాలు ఒప్పుకున్నాయి. సత్యం మరియు దైవం ఉన్నాయని ఒకవేళ మనం నమ్ముతున్నట్లయితే, కొన్ని పనులు చేయటాన్ని దైవం మనల్ని అనుమతించాడని మరియు మరికొన్ని చేయటాన్ని నిషేధించాడని మనం విశ్వసించవలసి ఉంటుంది.

ప్రామాణికమైన దివ్యావతరణ లేకుండా దైవం మనల్ని వదిలి వేయడని ఒకవేళ భావిస్తున్నట్లయితే, తమ వద్ద ప్రామాణికమైన దివ్యావతరణ ఉందని కేవలం ముస్లింలు మాత్రమే

దావా చేస్తున్న వాస్తవాన్ని మనం వెంటనే గ్రహిస్తాము. అది వారి దావాలోని నిజాన్ని ధృవీకరిస్తున్నది. అయినా, ఇంతకు ముందు తెలిపినట్లుగా, లోతుగా మరియు హేతుబద్ధంగా వివేకంతో ఆలోచిస్తూ, మన సంప్రదాయాలను గుడ్డిగా నమ్మకుండా, కేవలం సరైన ప్రామాణిక జ్ఞానం ఆధారంగా మాత్రమే దైవాన్ని విశ్వసించమని, ఖుర్ఆన్ ఆహ్వానిస్తున్నది.

దీనిలో అనేక చోట్ల, ఖుర్ఆన్ నుండి మేము పేర్కొన్నట్లుగా, "ఏం, వారు ఖుర్ఆన్ పట్ల లోతుగా ఆలోచించరా? ఒకవేళ అది అల్లాహ్ నుంచి గాక వేరెవరి నుంచైనా అయి ఉన్నట్లయితే, తప్పకుండా వారందులో ఎంతో వైరుధ్యాన్ని కనుగొని ఉండేవారు." [ఖుర్ఆన్ 4:82]

లోతుగా, న్యాయబద్ధంగా ఆలోచించమని చిత్తశుద్ధి గల పాఠకులతో మేము మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాము.

ఈ పుస్తకం గురించి, మీ అమూల్యమైన అభిప్రాయాలను, సలహాలను
teluguwebmaster@gmail.com telugu@islamhouse.com కు పంపగలరు.